ప్రజాశక్తి
గురువారం 22 మే 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

వర్షానికి పొంగిపొర్లుతున్న తీగలేరు

భారీ వర్షం

- జిల్లాలో పలుచోట్ల దంచికొట్టిన వాన
- పెద్దదోర్నాలలో నీటమునిగిన పొలాలు
- పొంగిపొర్లుతున్న తీగలేరు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్, పెద్దదోర్నాల

అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో పలు చోట్ల భారీ వర్షం కురిసింది. పలు చోట్ల రోడ్లపైకి నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెద్దదోర్నాలలో భారీవర్షం కారణంగా వాగులు పొంగిపొర్లాయి.

పెద్దదోర్నాల మండలంలో కురిసిన వర్షానికి తీగలేరు పొంగి పొర్లుతోంది. పొలాలు నీట మునిగాయి. వేసవిలో ముందస్తు అదునుగా వేసిన పత్తి మొక్కలన్నీ మునిగిపోయాయి. చెక్ డ్యాములు నిండి పొంగి పొర్లుతున్నాయి. వర్షంతో భూగర్భ జలమట్టం పెరిగి బోర్లలో నీటి మట్టం పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో కుంటలు నిండి పశువులకు తాగునీరు అందుబాటులో ఉంటుందని పేర్కొంటున్నారు. కాగా వేసవి ముందస్తు అదును లో భాగంగా వేసిన పత్తి మొక్కలు నీటిలో మునిగిపోవడంతో ఉరకలెత్తి చనిపోతాయని, తద్వారా రైతులకు నష్టం వాటిల్లనున్నట్లు రైతులు తెలిపారు.

మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

సమిష్టి కృషితో జిల్లా అభివృద్ధి

- ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంతో పనిచేయాలి
- ముందస్తుగా పంటల సాగుకు రైతులను సమాయత్తం చేయాలి
- డిఆర్‌సిలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా అభివృద్ధి బాటలో పయనించడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి పని చేయాలని సమాచార పౌర సంబంధాలు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి కోరారు. జిల్లా అభివద్ధి మండలి సమీక్షా సమావేశం స్థానిక కలెక్టరేట్ లోని విసి హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. జల వనరులు, వ్యవసాయ, జాతీయ ఉపాధి పథకం, పర్యాటక రంగం తదితర అంశాలపై సమీక్ష జరిగింది. ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంతో పనిచేయాలని అధికారులకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మార్గనిర్దేశం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. పొరుగు జిల్లాల కంటే మరింత అభివద్ధి సాధించాలనే పోటీతత్వంతో అధికారులు పనిచేయాలన్నారు. గడిచిన ఏడాదిలో జరిగిన అభివద్ధి, వివిధ రంగాలలో ఆర్థికవద్ధిపై అధికారులు నివేదిక సిద్ధం చేయాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడం మాని.. మీ ఇంటి నుంచి ప్రభుత్వ సేవలు పొందే విధానంపై ప్రజలలో చైతన్యం తీసుకురావాలన్నారు. తద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వేసవికాలం ముగిసేవరకు తాగునీటి సమస్య రానివ్వరాదని, ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి తీరువాకు వడ్డీని ప్రభుత్వం రద్దు చేసిందని, ఆ మేరకు డీఆర్సీలో కమిటీ ఆమోదించి తీర్మానం చేసినట్లు ప్రకటించారు. జిల్లా జిఎస్‌డిపి పెంచడమే లక్ష్యంతో అధికారులు పనిచేయాలన్నారు.

పంట కాల్వల పూడికతీత, మరమ్మత్తు పనులు వర్షాలు రాకముందే పూర్తి చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి ▶ 2లో

కలెక్టరేట్‌లో ఏం జరుగుతోంది.?

- పరిపాలనా విభాగంపై పాలకపక్షం అసంతృప్తి
- పేషీల్లో పిఎస్‌లు,సీసీల పనితీరుపైనా గరంగరం
- ఎమ్మెల్యేల సిఫార్సులు బుట్టదాఖలు చేస్తున్నారనే విమర్శలు
- మంత్రి స్వామి పలువురికి క్లాస్ పీకిన వైనం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

కలెక్టరేట్‌లో ఏం జరుగుతుందనే చర్చ పాలకపక్షంలో తీవ్రమైంది. ముఖ్యంగా పరిపాలనా విభాగం పనితీరుతో పాటు పేషీల్లో పిఎస్‌లు, సీసీలు, కొన్ని సెక్షన్లలో అధికారులు సక్రమంగా వ్యవహరించడం లేదనే చర్చ సాగుతోంది. వీరి పనితీరుపైనా పాలకపక్ష ఎమ్మెల్యేల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఎవరి చెప్పాలో కూడా తెలియడం లేదని ఎమ్మెల్యేల వ్యక్తిగత సిబ్బంది వాపోతున్నారు. కలెక్టర్ అన్సారియా పాలనాపరమైన వ్యవహారాల్లో నిబంధనలకు అనుగుణంగా పోతున్నారు. ఆమె వద్దకు వెళ్లే ఫైళ్లు నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే క్లియర్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వెళ్లే ఫైళ్లను వెనక్కు పంపడంతో పాటు ఆయా శాఖల అధికారుల పైనా కలెక్టర్ పలు సందర్భాల్లో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారనే చర్చ ఉంది.

ఇక కలెక్టరేట్‌లో పాలనా విభాగం ఇదే అదునుగా అన్ని వ్యవహారాలను సరిగ్గా పట్టించుకోవడం లేదంటున్నారు. కలెక్టర్ సీరియస్‌గా ఉంటున్నారనే సాకుతో ఏ ఫైలునూ సకాలంలో పంపడం లేదంటున్నారు. ముఖ్యంగా బదిలీలు, డిప్యు టేషన్లు వంటి వ్యవహారాల్లో ఎమ్మెల్యేలు ఇచ్చిన లేఖలు పాలనా విభాగంలోనే ఎక్కువ రోజులు నిలిచిపోతున్నాయని సమాచారం. చాలా సిఫార్సు లేఖలు బుట్ట దాఖలవుతున్నట్లు కూడా చెబుతున్నారు. కలెక్టరేట్ పాలనా అధికారిపైనా ఎమ్మెల్యేల్లో అసంతృప్తి ఉంది. ఈయన పని తీరు సరిగా లేదంటున్నారు. ఏ లేఖ పంపినా వెంటనే సంబంధిత శాఖలకు పంపాలి. అసలు వాటిని పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేల్లో చర్చ సాగుతోంది. ఆయన పాలనా వ్యవ హారాల్లో చురుగ్గా లేరంటున్నారు. ఎందుకంటే ఇక్కడ పాలనా విభాగమే అన్ని వ్యవహారాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది.ఇక పలువురు ఉన్నతాధికారులు పేషీల్లోనూ ఫైళ్లు మూవ్ కావడం లేదంటున్నారు. ఎన్ని సార్లు చెప్పినా చేయడం లేదనే చర్చ సాగుతోంది. కలెక్టర్ పేషీలో పిఎస్‌తో పాటు సీసీల పనితీరుపైనా కొందరు ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నారు. వారి స్పందన సానుకూలంగా లేదంటున్నారు. చాలాకాలంగా కొందరు కలెక్టర్ వ్యక్తిగత సిబ్బంది పేషీని వదలకుండా అంటిపెట్టుకుని ఉంటున్నారనే విమర్శలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఇంకా చెప్పాలంటే అప్పటి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నారనే ముద్ర పడిన సిబ్బంది అందరూ మళ్లీ కలెక్టర్ వద్ద చేరిపోయారనే చర్చ ఉంది. వీరి గత చరిత్ర ఏమిటనేదీ ఓ పాలకపక్ష ఎమ్మెల్యే కార్యాలయం బయటకు తీసింది. కలెక్టర్ పిఎస్‌గా ఉన్న తహశీల్దారు స్థాయి అధికారి ఆ హోదాను అడ్డదారిలో తెచ్చుకున్నారని గుర్తించారు. డీటీ నుంచి తహశీల్దారుగా తప్పుడు ఆర్డర్‌తో వచ్చారని, ఆ తర్వాత గత కలెక్టర్ దినేష్‌కుమార్ ఇది నిజమేనని, సరిచేయాలని ఇచ్చిన స్పీకింగు ఆర్డర్‌ను కూడా బయటకు తీశారు. ఆయన వ్యవహార శైలిపై విమర్శలున్నాయి. ఎమ్మెల్యేల పిఏలు ఫోను చేసినా సరిగా స్పందించరనే చర్చ ఉంది. ఈ ప్రభావం అక్కడున్న సీసీలపైనా పడుతోంది. కలెక్టర్‌ను వీళ్లు నడిపిస్తున్నారా? లేక కలెక్టర్ చెప్పినట్లు వీళ్లు వింటున్నారా? అనే చర్చ సాగుతోంది. ఇంకా వాట్సప్‌లలో ప్రభుత్వంపైనా, సిఎం చంద్రబాబుపైనా కొందరు సిబ్బంది హేళనగా పెట్టిన పోస్టింగులను పాలకపక్ష నేతలు ▶ 2లో

మార్కాపురంలో రోడ్డుప్రమాదంలో ధ్వంసమైన కారు

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

- పంగులూరులో ఇద్దరు
- మార్కాపురంలో ఇద్దరు..
- పాకలలో మరొకరు మృతి

▶ 3లో

ప్రభుత్వ రంగ సంస్థలతో

పొగాకు కొనుగోలు చేయించాలి

- లో గ్రేడ్ పొగాకునూ కొనాలి..
- గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి..
- ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం డిమాండ్

వేలం కేంద్రంలో మాట్లాడుతున్న రైతుసంఘం నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పొగాకు రైతులను ఆదుకునేందుకు బోర్డు జోక్యం చేసుకొని ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోళ్లు జరపాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం డిమాండ్ చేసింది. బుధవారం నాడు ఒంగోలు పరిధిలో పేర్నమిట్ట (1), త్రోవగుంట (2) వేలం కేంద్రాలను రైతుసంఘం బందం వేలం సరళిని పరిశీలించింది. లోగ్రేడ్ కొనుగోలు చేయడం లేదని ఒకటో వేలం కేంద్రం సూపరింటెండెంట్ రవికాంత్ స్పష్టం చేశారు. రెండు వేలం కేంద్రాల్లో వేలంలో పాల్గొన్న బయ్యర్లు ఏ ఒక్కరూ లోగ్రేడ్ పొగాకు కొనుగోలు చేయక పోవడం పట్ల ▶ 2లో

కలెక్టరేట్‌లో ఏం జరుగుతోంది.?

(మొదటిపేజీ తరువాయి)

గుర్తించారు. వాటిని కూడా సేకరించి వీళ్ల సంగతి తేల్చాలనే ఆలోచనలో ఉన్నారు. డిఆర్‌ఓ పేషీలోని ఓ సిబ్బంది పనితీరుపైనా చర్చ సాగుతోంది. ఏ సెక్షన్‌లో ఒక ఉద్యోగిపైనా పాలకపక్ష ఎమ్మెల్యేల్లో అసంతృప్తి ఉంది. వారి పనితీరుపై సంతృప్తిగా లేరు. ఎవరూ వేగంగా పని చేయడం లేదంటున్నారు. ఈ వ్యవహారాలు మంత్రి డోలావీరాంజనేయస్వామి దృష్టికి పోగా ఆయన ఇటీవలే జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసుతో సీరియస్‌గా మాట్లాడారని సమాచారం. మంత్రి డోలా ఎవరి పనితీరు సరిగా లేదని సూచించి హెచ్చరికలు చేశారో వారందరినీ వెళ్లి మంత్రిని కలిసి వివరణ ఇచ్చుకోవాలని డిఆర్‌ఓ సూచించారు. దీంతో పాలనా అధికారితో పాటు డిఆర్‌ఓ సీసీ, ఏ సెక్షన్‌లో ఒక ఉద్యోగి వెళ్లి మంత్రి డోలా వీరాంజనేయస్వామిని కలిశారు. ఆయన వీరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారని వినికిడి. పనితీరు మార్చోకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. ఈ పరిణామాలన్నీ పాలనపై పడుతున్నాయని భావిస్తున్నారు. పాలనలో అవినీతి ఏమాత్రం తగ్గకపోవడం కూడా పాలకపక్ష నేతలకు మింగుడుపడటం లేదు. అధికారులు ఇష్టానుసారంగా ఉన్నారనే చర్చ జోరుగా సాగుతోంది. ఈ పరిణామాలు చూస్తుంటే పాలన ఇంకా గాడిలో పడలేదని భావిస్తున్నారు. కలెక్టర్ ఎంత సీరియస్‌గా ఉన్నా కిందస్థాయి ఉద్యోగులు, సెక్షన్లలో ఉద్యోగులు క్రియాశీలకంగా లేకుంటే పాలన ముందుకు సాగడం కష్టమే.. కలెక్టరేట్‌లో పాలనపై కలెక్టర్ తక్షణం దృష్టి సారించాలని పాలకపక్ష నేతలు భావిస్తున్నారు.

సమిష్టి కృషితో జిల్లా అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించారు. మార్చిలోగా టెండర్లు పూర్తి చేసి, వేసవిలోగా పనులు ముగించాలని గతంలో ఆదేశించినప్పటికీ నేటికీ టెండర్ల ప్రక్రియలోనే ఉండటంపై అసంతప్తి వ్యక్తం చేశారు. వర్షాలు మొదలవుతుంటే పనులు ఎప్పుడు చేస్తారు.. ఎలా పూర్తవుతాయి.. పంట కాల్వల మరమ్మతు పనులు నామమాత్రంగా నిర్వహించి బిల్లులు పెట్టుకోవడానికా.? అంటూ అధికారులను నిలదీశారు. ఆ పనులను నెలరోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సంవత్సరంలో వర్షాలు ముందుగా వచ్చే అవకాశం ఉందన్నారు. సాగునీటి విడుదలకు సిద్ధంగా ఉండాలని, ముందస్తుగా పంటల సాగుకు రైతులను సమాయత్తం చేయాలని అన్నారు. ఎత్తిపోతల పథకాలు పునరుద్ధరించడానికి అంచనాలు నవీకరించాలన్నారు. తయారుచేసిన అంచనాల ప్రతిపాదనలపై నివేదిక ఇవ్వాలన్నారు. రైతులకు మేలు చేయడమే లక్ష్యంతో ఇంజినీర్లు సహకరించాలన్నారు. ఉపాధి హామీ కింద గత ఏడాది రూ.20 కోట్ల నిధులు మురిగిపోవడంపై అధికారులను నిలదీశారు. జిల్లాకు నష్టం జరగకుండా అధికారులు ప్రణాళికతో పనిచేయాలన్నారు. అత్యధికంగా ఉపాధి పనులు చేపట్టాలని, కూలీలకు విస్తతంగా పనులు కల్పించాలని పేర్కొన్నారు. పొగాకు పంట అధికంగా సాగు చేయాలని కంపెనీలు ఒత్తిడి చేసి, దిగుబడి వచ్చిన తర్వాత రైతులను వదిలేయడం మంచి పద్ధతి కాదన్నారు. జిల్లాలో రైతులు పండించిన పొగాకు పంటను మొత్తం సదరు కంపెనీలు కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సాగులో కంపెనీల భాగస్వామ్యం ఉన్నందున రైతులకు నష్టం జరగకుండా ఖచ్చితంగా కొనుగోలు చేయించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. కనీస మద్దతు ధరలు కల్పించకుండా రైతులను బ్లాక్ మెయిల్ చేస్తే కంపెనీలపై చర్యలు తీసుకోవాలన్నారు.

105 పొగాకు బేళ్లు తిరస్కరణ

టంగుటూరు : టంగుటూరు పొగాకు బోర్డుకు పొందూరు, ఆలకూరపాడు, రావివారిపాలెం, పాలేటిపాడు, జయవరం, అనంతవరం గ్రామాలకు చెందిన రైతులు 568 బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. అందులో 463 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 105 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.280, అత్యల్ప ధర రూ.205, సరాసరి ధర 236.95 పైసలు పలికింది.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

కూలీలు అధిక వేతనం పొందేలా పనులు చేయాలని ఎపిఒ శ్రీనివాస నాయక్ తెలిపారు. మండల పరిధిలోని పెద గోగులపల్లి, మిట్టపాలెం, శీలంవారిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరును పరిశీలించారు. అనంతరం శ్రీనివాస్ నాయక్ కూలీలతో మాట్లాడుతూ పని వేళలు పాటించి, అత్యధిక వేతనం పొందేలా పనిచేయాలన్నారు. పని చేయకుండా అధిక వేతనం కోసం ప్రత్యామ్నయ మార్గాలు చూడొద్దని తెలిపారు. వారాంతంలో చేసిన పని కొలతలు దగ్గరుండి చూపించుకొని ఎంత వేతనం పొందారో తెలుసుకొని, పని గంటలు పెంచుకొని అధిక వేతనం పొందాలని తెలిపారు. ఎవరికీ ఎలాంటి చెల్లింపులు చేయవద్దని తెలిపారు.

కూలీలతో మాట్లాడుతున్న ఎపిఒ శ్రీనివాసనాయక్

కొలతలు మేరకు పని చేసుకొని వేతనం పొందాలన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లల చేత వారి కుటుంబ సభ్యుల బదులుగా పనులు చేయించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలతో పొగాకు కొనుగోలు చేయించాలి..

(మొదటిపేజీ తరువాయి)

రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జుజ్జూరి జయంతి బాబు, పమిడి వెంకటరావు, ఉపాధ్యక్షులు పెంట్యాల హనుమంతరావు, అబ్బూరి వెంకటేశ్వర్లు అక్షేపణ వ్యక్తం చేశారు. రైతులు వేలంకు తెస్తున్న వాటిలో 50 శాతం బేళ్లు తిరస్కరించడం వల్ల రైతులకు ఎంత నష్టం కలుగుతుందో తెలుసా.? అని వేలం నిర్వాహకులను ప్రశ్నించారు. కనిష్ఠ ధర కిలో రూ.200కు తగ్గించడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. గత సంవత్సరం కిలో సగటు ధర కిలో రూ.265కు కొనుగోలు చేసిన వైనాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ఏడాది కొనుగోలు చేసిన సగటు ధర కిలో రూ.265పై 25 శాతం పెంచి ఈ ఏడాది కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం కిలో రూ.360 కొనుగోలు చేసిన కంపెనీలు ఈ ఏడాది ఎందుకు కొనుగోలు చేయడం లేదని కంపెనీ ప్రతినిధులను, రెండో వేలం కేంద్రం నిర్వహణాధికారి జె.తులసిని ప్రశ్నించారు.160 మిలియన్ కిలోల పొగాకు అనుమతించిన బోర్డు ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ ఏడాది విస్తీర్ణం పెరిగినా, దిగుబడి తగ్గిందని, అనుమతించిన మేరకు కొనుగోలు చేయనప్పుడు ఎందుకు అనుమతించారని అధికారులు, బయ్యర్లను రైతుసంఘం నేతలు ప్రశ్నించారు. ఈ నెలాఖరులో లోగ్రేడ్ కొనుగోళ్లు ప్రారంభించే అవకాశం ఉన్నట్లు రెండో వేలం కేంద్రం నిర్వహణాధికారి తులసి పేర్కొన్నారు. కంపెనీలకు విదేశీ ఆర్డర్లు రానందున కొనుగోళ్లు మందగొడిగా సాగుతున్నాయని, ఈ నెలాఖరుకు విదేశీ ఆర్డర్లు వచ్చే అవకాశం ఉన్నట్లు కంపెనీలు చెబుతున్నాయని చెప్పారు. మార్కెట్ ఇదేరీతిలో కొనసాగితే ఈ ఏడాది పొగాకు పండించిన ఏ ఒక్క రైతుకు లాభం చేకూరదని, 10 శాతం మందికి ఖర్చులు వస్తాయని 90 శాతం మంది రైతులు బ్యారన్‌కు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు నష్టపోయే ప్రమాదం ఉందని జయంతి బాబు, వెంకటరావు, హనుమంతరావు అధికారులకు తెలిపారు. కౌలు రైతులు మరింత నష్టపోయే ప్రమాదం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ ఏడాది కోల్డ్ స్టోరేజీ అద్దెలు 50 శాతం పెంచడం, కౌలు 25 వేల నుంచి 50 వేలు బ్యారెన్ అద్దెలు గణనీయంగా పెంచడం వంటి పరిణామాల వల్ల పెట్టుబడి మరింత పెరిగాయన్నారు. కాగా వేలం ప్రారంభించిన నిన్నమొన్నటి వరకు కనిష్ఠ ధర కిలో రూ.240 ఉండగా, వారం పది రోజులుగా ధర కిలో రూ.200 పడిపోవడం వెనుక బయ్యర్లు సిండికేట్ అయినట్లు తెలుస్తోందన్నారు. ఇదే ధర కొనసాగిస్తే రైతులు ఎంతకో కొంతకు అమ్ముకుంటారనే వ్యూహంతో కంపెనీలు ఆలోచిస్తున్నట్లు వారు ఆరోపించారు. ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకొని మార్క్‌ఫెడ్ వంటి ప్రభుత్వ రంగసంస్థలను రంగంలోకి దించాలని వారు డిమాండ్ చేశారు. లోగ్రేడ్ పొగాకు కొనుగోళ్లు కూడా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వేలం కేంద్రాలు సందర్శించిన వారిలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెజవాడ శ్రీనివాసరావు, జిల్లా నాయకులు కరిచేటి హనుమంతరావు, కిలారి పెద్దబ్బాయి, అన్ను సుబ్బారావు, వాసు ఉన్నారు.

లోగ్రేడ్ కొంటేనే గిట్టుబాటు

ఇలవల జనార్ధనరెడ్డి, నేలటూరు

ఈ ఏడాది 50 ఎకరాలు కౌలుకు సాగు చేశా.. 400 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.. నిరుడి కంటే 100 క్వింటాళ్లు తగ్గింది. నిరుడు ఈ పాటికే 200 క్వింటాళ్లు అమ్మగా ఇప్పుడు కేవలం 80 క్వింటాళ్లు మాత్రమే అమ్మాను. లోగ్రేడ్ వేలంకు తేవద్దంటున్నారు.

మూడొంతులు పొగాకు నిలబడి పోయింది..

కె.శేషరావు, నరసాయిపాలెం

ఈ సంవత్సరం 50 ఎకరాలు కౌలు వేశా.. (ఎకరా కౌలు రూ 25 వేలు) నిరుటి కంటే దిగుబడి తగ్గింది. నాణ్యత కూడా తగ్గింది. పోయిన ఏడు మాడుతో సహా కొన్నారు. ఈ ఏడు గ్రేడ్ పొగాకు మాత్రం కొంటున్నారు. మూడోంతులు నిలబడి పోయింది. బ్యారన్‌కు 4 నుంచి 5 లక్షలు నష్టం వస్తుంది.

రూ.40 లక్షలు పెట్టుబడి పెట్టా..

పోలినేని ఆదినారాయణ, ఓబన్నపాలెం

25 ఎకరాలు సాగు చేశా.. రూ.40 లక్షలు అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టా.. కౌలు రూ.25 వేల వంతున, బ్యారన్ అద్దె మొత్తం కలిపి ఎకరాకు రూ.2.50 లక్షలు ఖర్చయ్యాయి. రేటు రోజురోజుకీ తగ్గిస్తున్నారు. అసలయినా వస్తుందో, రాదో అని ఆందోళనగా ఉంది.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

కొండపి వేలం కేంద్రానికి. క్లస్టర్ పరిధిలోని అక్కచెరువుపాలెం, పైడిపాడు గ్రామాలకు చెందిన రైతులు 635 పొగాకు బేళ్లను బుధవారం అమ్మకానికి తెచ్చారు. అందులో 562 బేళ్లఅమ్ముడు పోయాయి. వివిధ కారణాలతో 73 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.200, సరాసరి ధర రూ.264.31పైసలు నమోదైంది. వేలంలో 20 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నట్లు వేలం నిర్వాహణాధికారి సునీల్ కుమార్ తెలిపారు.

CHANGE OF SURNAME

I, **LAKKSHMII VINAYACK GUNNDEBOMMU,** (Old name) S/o.**VENKAT RAU GUNNDEBOMMU,** R/o. D.no: 8-55, Lawyer pet, 7th cross road, ongole, prakasam dt, AP - 523002 I Have Changed my surname as **LAKKSHMII VINAYACK GUNDEBOMMU** (New name),S/o. VENKAT RAU GUNDEBOMMU, Hereafter my name is known as **LAKKSHMII VINAYACK GUNDEBOMMU** (New Name), S/o.VENKAT RAU GUNDEBOMMU.

CHANGE OF NAME

I, **BHARATHA KUMAR CHEKODDI** No.**15329640X,** Rank: Hav Unit:2 Engr Regt Resident of Village : JAYARAMPURAM, Post: YELLUPALLE, Teh: GIDDALUR Dist: PRAKASAM State: ANDHRA PRADESH, Pin: 523357, have changed my son name from **SATHVIK CHEKODDI** to **CHEKODDI SATHVIK** and his DOB is **29-07-2010** vide Affidaved dated 21-05-2025 before Shaik Yasin Basha, Advocate & Notary, Giddalur. Prakasam District. AndhraPradesh.

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

నా పేరు మల్లెల రాంబాబు. వేటపాలెం మండలం చల్లారెడ్డి పాలెం పంచాయితీ జబ్బార్ కాలనీ నివాసిని. మా యొక్క భూమికి సంబంధించిన దస్తావేజు నెంబరు :1390/2018 గల ఒరిజినల్ దస్తావేజులు తేది:10-5-2025న వేటపాలెం గడియారస్తంభం సెంటర్లో జిరాక్స్ తీసుకుని వస్తుండగా పోయినవి. ఎంత వెతికినను దొరకలేదు. కావున ఎవరికైనను దొరికిన యెడల మాయందు దయవుంచి వేటపాలెం పోలీస్ వారికి కానీ, ఈ క్రింది మా చిరునామాలో కానీ అంద జేయగలరు.లేక సెల్ : 8712246894 నెంబర్‌ను సంప్రదించగలరు.

మా చిరునామా
మల్లెల రాంబాబు
S/o హనుమంతరావు,
జబ్బార్ కాలనీ,
చల్లారెడ్డి పాలెం పంచాయితీ,
వేటపాలెం మండలం,
బాపట్ల జిల్లా.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో, అద్దంకి

O.S.No: 450/2021

దొడ్డ రమేష్ బాబు ......వాది
Vs
కూరపాటి రాజారావు .....ప్రతివాది

To
కూరపాటి రాజారావు S/o హరిబాబు
R/o బొబ్బేపల్లి గ్రామం, మార్టూరు మండలం,
బాపట్ల జిల్లా

పై నంబరు దావాలో వాది తేది : 09-03-2019 ప్రాంసరీ నోటు బాకీ వసూలు నిమిత్తం మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీయుత కోర్టు వారు ఉత్తర్వుల మేరకు మీరు తేది 04-07-2025న ఉదయం 10.30 నిమిషాల నుండి సాయంత్రం 5 గంటల లోపు పైకోర్టు వారు ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపగలరు. లేనిచో దావాని మీకు పరోక్షంగా తీర్మానించబడును.

వాయిదా తేది: 04-07-2025

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులుతో//

అద్దంకి
తేది: 21-05-2025 ఇట్లు

మోతుకూరి సుభాష్ బాబు
మురకొండ చంద్రశేఖర్
అడ్వకేట్స్, అద్దంకి.

జిల్లా నీరు మరియు పారిశుధ్య మిషన్ - బాపట్ల జిల్లా, బాపట్ల

స్వచ్ఛ భారత్ మిషన్ ప్రోగ్రాం లో పని చేయుటకు
ఈ క్రింద తెలిపిన కాంట్రాక్టు ఉద్యోగాల కొరకు అర్హులైన అభ్యర్థులు నుండి దరఖాస్తులు కోరడమైనది.

1) LWM కన్సల్టెంట్ : సైన్స్ లేదా ఆర్ట్స్‌లో డిగ్రీ కనీసం 50% మార్కులతో పాస్ అయి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది

2) డేటా ఎంట్రీ ఆపరేటర్ కమ్ అకౌంటెంట్ : సైన్స్ లేదా ఆర్ట్స్‌లో డిగ్రీ కనీసం 50% మార్కులతో పాస్ అయి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం మరియు అకౌంట్స్ పరిజ్ఞానం ఉండాలి. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది

పై ఉద్యోగాలకు దరఖాస్తులు, సంబంధిత సర్టిఫికెట్స్‌ను జతపరచి, ది:22-05-2025 మధ్యాహ్నం 12 గంటలు లోపు SE RWS Bapatla వారి కార్యాలయానికి సమర్పించవలెను. అదే రోజు ది : 22-05-2025 సాయంత్రం 4 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావలెను.

చైర్మన్ & డిస్ట్రిక్ కలెక్టర్,
జిల్లా నీరు మరియు పారిశుధ్య మిషన్,
బాపట్ల జిల్లా,బాపట్ల

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

పంగులూరులో కారు ఢీకొని ఇద్దరు దుర్మరణం

మార్కాపురంలో బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరు మృతి

పాకలలో ఆటో బోల్తాపడి యువకుడు మృతి

ప్రజాశక్తి-పంగులూరు

అతివేగంతో వస్తున్న కారు దూసుకొని వచ్చి రోడ్డు మార్జిన్‌లోకి ఉన్న వ్యక్తులను ఢీకొనటంతో ఇద్దరు మృతి చెందగా మరణించారు. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. మరణించిన వారిలో పంగులూరు మండలంలోని కొండమూరు గ్రామానికి చెందిన సిపిఎం నాయకుడు సంపెంగల వెంకటరావు (50), నెల్లూరు జిల్లా నందిపాడు గ్రామానికి చెందిన దిలీప్ (27) ఉన్నారు. ఈ ప్రమాదం బుధవారం మధ్యాహ్నం జాగర్లమూడివారిపాలెం- ముప్పవరం మధ్య జాతీయ రహదారిపై జరిగింది. వివరాల్లోకి వెళితే... మండలంలోని కొండమూరు గ్రామానికి చెందిన సంపంగల వెంకటరావు ప్రతి సంవత్సరం వేసవికాలంలో జాతీయ రహదారి పక్కన తాటికాయలు కొట్టి ముంజులు అమ్ముతూ ఉంటాడు. అదే విధంగా బుధవారం కూడా వెంకట్రావు జాతీయ రహదారిపై చెట్టు నీడను కుర్చుని తాటిముంజలు అమ్మే పనిలో ఉన్నాడు. జాతీయ రహదారిపై వెళ్లే కార్లు, ఇతర వాహనాల్లో వెళ్లే ప్రయాణికులు

వెంకట్రావు (ఫైల్)

మృతి చెందిన దిలీప్, వెంకట్రావు

వాహనాలను ఆపుకొని తాటి ముంజలు కొని, తిని సేద దీరుతుంటారు. బుధవారం మధ్యాహ్నం నెల్లూరు జిల్లా నందిపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, అతని భార్య, కుమారుడు దిలీప్‌లు విశాఖపట్నం నుండి కారులో స్వగ్రామానికి బయలు దేరారు. మార్గమధ్యంలో తాటి ముంజలు తిని సేద తీరేందుకు ఒంగోలు వైపు వెళ్లే జాతీయ రహదారి రోడ్డు మార్జిన్‌లో కారు ఆపుకుని దిగుతున్నారు. ఇదే రహదారిలో అమరావతి నుంచి చీమకుర్తివైపు వెళుతున్న కారు అతి వేగంగా వచ్చి కారు దిగుతున్న వారితో పాటు, ముంజులు తీస్తున్న వెంకటరావును నేరుగా ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకటరావుతోపాటు దిలీప్ అక్కడికక్కడే మరణించగా, దిలీప్ తండ్రి వెంకటేశ్వర్లుకు కాలుకి, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి రేణింగవరం ఎస్సై వినోద్ బాబు, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు చేరుకొని హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి క్షతగాత్రులను తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వాసుపత్రిలో ఉంచారు. తీవ్ర గాయాలైన వెంకటేశ్వర్లును మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చివరిదాకా సిపిఎంలో వెంకటరావు..

పేదరికంలో పుట్టి, ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ తను నమ్మిన సిపిఎంలో సంపెంగల వెంకటరావు చివరిదాకా కొనసాగారు. మండలంలో సిపిఎం నిర్వహించే అన్ని రకాల కార్యక్రమాల్లో వెంకట్రావు పాల్గొంటాడు. సిపిఎంపై అచంచల విశ్వాసం ఉన్న వెంకటరావు ఎన్ని పనులు ఉన్నప్పటికీ పార్టీ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటారని సిపిఎం మండల కార్యదర్శి తలపనేని రామారావు తెలిపారు. వెంకట్రావు మరణ వార్త తెలిసిన వెంటనే సిపిఎం నాయకులు తలపనేని రామారావు, రాయిని వినోద్ బాబు, గుడిపాటి మల్లారెడ్డి, తంగిరాల వెంకటేశ్వర్లు తదితరులు అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి నివాళులర్పించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు.. ఇద్దరు మృతి

మార్కాపురం రూరల్ :

ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని కోమటికుంట వద్ద అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని కొండేపల్లి గ్రామానికి చెందిన చాగంటి గాలిరెడ్డి (64), వేములపేటకు చెందిన జంకె శ్రీనివాసరెడ్డి(55) ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కోమటికుంట వద్ద కారు ఢీకొట్టింది. ఇద్దరికీ బలమైన గాయాలు కావడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటన స్థలానికి చేరుకున్న మార్కాపురం గ్రామీణ ఎస్ఐ అంకమ్మరావు, ఏఎస్ఐ లక్ష్మీ రంగయ్య, పోలీస్ సిబ్బంది ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ అంకమ్మరావు తెలిపారు. ప్రమాదానికి గల కారణమైన కారు డ్రైవర్ మాత్రం ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వారే తమ వాహనానికి

ఘటనా స్థలంలో మృతదేహాలు

ఎదురు రావడంతోనే ప్రమాదం జరిగిందని అంటున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జీజీహెచ్‌కి తరలించారు.

ఆటో బోల్తా.. యువకుడు మృతి

సింగరాయకొండ: ఆటో అదుపు తప్పి బోల్తా పడి ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం సింగరాయకొండ మండలం పాకల గ్రామంలో చోటుచేసుకుంది. పాకల కి చెందిన, రేవు రాజేష్ (21), మరియు సైకం సంతోషంలు కలిసి ఆటోలో పాకల నుంచి శింగరాయకొండకు వస్తుండగా పాకల దాటిన తర్వాత కోనేరు సమీపంలో ఆటో డ్రైవర్ అతి వేగంగా, నడిపి స్పీడులో అదుపు చేయలేక బోల్తా కొట్టింది. రాజేష్ తలకు బలమైన రక్త గాయం అయింది. చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తీసుకెళ్లగా డాక్టర్ పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన ఆటో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. మృతి చెందిన రేవు రాజేష్ డిగ్రీ చదువుతూ సెలవులు కావడంతో ఇంటి దగ్గరే తల్లిదండ్రులకు తోడుగా ఉంటున్నాడు.

రాజేష్ (ఫైల్)

సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

ఉపాధి పనులు తనిఖీ చేసిన ఎంపీడీవో కె.వాణి

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

కూలీలకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ కె.వాణి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం లోఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. ప్రతి పంచాయతీలో కూలీలకు పనులు కల్పించాలని చెప్పారు. గిట్టుబాటు కూలీ వచ్చే విధంగా కూలీల చేత పని చేపించాలని, పని ప్రదేశంలో మస్టర్లు వేయాలని చెప్పారు. సిబ్బంది అక్రమాలకు పాల్పడితే ఇబ్బంది పడాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ శ్రీనివాస నాయక్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు డ్రోన్ కెమెరా అందజేత

ప్రజాశక్తి-దొనకొండ

దొనకొండ పోలీస్‌స్టేషన్‌కు మండల టీడీపీ అధ్యక్షుడు మోడి ఆంజనేయులు అత్యాధునిక టెక్నాలజీకి చెందిన డ్రోన్ కెమెరాను బుధవారం జిల్లా ఎస్పీ దామోదర్ చేతుల మీదుగా దొనకొండ పోలీస్‌శాఖకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు, అసాంఘిక కార్యక్రమాలను అరికట్టేందుకు, ట్రాఫిక్ నియంత్రణకు డ్రోన్ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని దొనకొండ పోలీస్ స్టేషన్‌కు డ్రోన్ కెమెరాను అందజేసిన ఆంజనేయులును అభినందించారు. దొనకొండ మండలంలో ప్రజల శ్రేయస్సు, శాంతి భద్రతలు కొరకు పోలీసుల సూచనల మేరకు సొంత నిధులతో డ్రోన్ కెమెరాను అందజేయటం జరిగిందని ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, త్రిపురాంతకం సీఐ హసన్, ఎస్ఐ త్యాగరాజు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాను అందజేస్తున్న మోడి ఆంజనేయులు

జ్యూస్ షాపు దగ్ధం

రూ.2 లక్షలకు పైగా ఆస్తి నష్టం

ప్రజాశక్తి-పెద్దారవీడు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జ్యూస్ షాపు దగ్ధం అయింది. ఈ సంఘటన పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టు బస్టాండు సెంటర్‌లో బుధవారం తెల్లవారు జామున జరిగింది. అందిన వివరాల మేరకు.. దూదేకుల చాంద్‌బాషా జ్యూస్ పాయింట్‌తో జీవనం సాగిస్తున్నారు. తెల్లవారు జామున 5 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురైంది. షాపులో ఉన్న ఫ్రిజ్లన్నీ కాలిపోయాయి. ఫర్నీచర్ కూడా బూడిదైంది. సుమారు రూ. 2లక్షల మేర ఆస్తి నష్టం జగినట్లు అంచనా.

కాలిపోయిన సామాన్లు

అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

పలుచోట్ల పోలీసుల కార్డన్ సెర్చ్

అనుమతి లేని వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-కొండపి

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కొండపి సీఐ సోమశేఖర్ అన్నారు. బుధవారం కొండపి టౌన్‌లో, కమ్మపాలెం, గొడుగులపాలెంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో సీఐ సోమశేఖర్ మాట్లాడుతూ డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఎటువంటి పత్రాలు లేని దాదాపు 100 ద్విచక్ర వాహనాలను ఒక ఆటోను సీజ్

కొండపిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

శింగరాయకొండలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

చేసామన్నారు. కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ధ్రువపత్రాలతో పాటు హెల్మెట్ ను ధరించాలని, పరిమిత వేగంతో వాహనాన్ని నడపాలని మద్యం సేవించి వాహనాన్ని నడిపితే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. పేకాట, అక్రమ మద్యం అమ్మకాలు గంజాయి అమ్మకాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి తీసుకుని వస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి అటువంటి వారిపై శాఖా పరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రతినెల ఇదేవిధంగా కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో బాంబు డిస్పోజల్, రోబో టీమ్స్, డాగ్ స్క్వాడ్, వజ్రా వెహికల్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ కె.శ్రీనివాసరావు, కొండపి ఎస్సై ప్రేమ్ కుమార్, ఏఆర్‌ఆర్ ఎస్సై పాపి రెడ్డి, ఏఎస్సై అంకారావు, హెడ్ కానిస్టేబుల్స్ కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రమేష్, కానిస్టేబుల్స్ సుధాకర్, అనిల్, రవి, సురేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పామూరు: ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆదేశాలతో పామూరు సీఐ ఎం భీమా నాయక్ బుధవారం పట్టణంలోని విరాట్ నగర్ నేషనల్ హైవే రహదారిలో తనిఖీలు చేపట్టారు. కార్డెన్ అండ్ సెర్చ్‌లో భాగంగా పట్టణంలోని అనుమానిత ప్రాంతాలను, అనుమానిత వ్యక్తులను, పాత నేరస్తులను, వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ భీమా నాయక్ మాట్లాడుతూ గంజాయి, మద్యపానం, మత్తు పదార్థాలు కలిగియున్న, విక్రయించిన, వినియోగించినా జైల్లో ఊచలు లెక్క పెడతారని హెచ్చరించారు. గతంలో ఎన్నడు లేనివిధంగా 215 మంది ఏఆర్ పోలీసులు, స్పెషల్ బెటాలియన్ పోలీసులు, సబ్ ఇన్‌స్పెక్టర్లుతో పామూరు పట్టణంలో తనిఖీలు చేపట్టారు.

శింగరాయకొండ: శింగరాయకొండ పట్టణంలో బుధవారం చంద్రబాబు నాయుడు కాలనీ, మల్లె తోట, గాంధీనగర్ ఏరియాలలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ట్రాఫిక్కు ఇబ్బందికరంగా ఉన్న మోటారు బైకులను, ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. డ్రోన్ కెమెరా సాయంతో ప్రతి ఇంటిని జల్లెడ పట్టారు. సరైన పత్రాలు లేని 25 బైకులు, ఐదు ఆటోలు, ఒక ట్రాక్టర్ని స్వాధీనం చేసుకున్నారు.

గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

బైక్‌ను ఢీకొన్న కారు.. వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ద్విచక్రవాహనంను కారుఢీ కొట్టడంతో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం ఉప్పుగుండూరులోని 216 జాతీయ రహదారి రాధాకృష్ణ కోల్డ్ స్టోరేజ్ సమీపంలో జరిగింది. వివరాల మేరకు ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన బెల్లం ఆంజనేయులు ద్విచక్రవాహనంపై పొలం నుంచి రోడ్డు దాటుతుండగా చీరాల వైపు నుంచి ఒంగోలు వెళ్తున్న కారు ఢీకొనడంతో ఆంజనేయులుకు తలకు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో ఒంగోలు వెంకటరమణ ఆస్పత్రికి తరలించగా అక్కడనుండి మెరుగైన వైద్యం కోసం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

సుందరయ్య స్ఫూర్తితో ప్రజా పోరాటాలు

'పుచ్చలపల్లి' వర్ధంతి సభలో సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య

మాట్లాడుతున్న సిహెచ్ గంగయ్య

ప్రజాశక్తి - బాపట్ల

స్వతంత్ర సమరయోధులు, ఆదర్శ కమ్యూనిస్టు కామ్రేడ్స్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధన, సమ సమాజ స్థాపన కోసం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఉప్పరపాలెంలో బుధవారం జరిగిన సభలో సుందరయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఎం ఉప్పరపాలెం కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని అధ్యక్షత వహించారు. సభలో గంగయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, పీడిత ప్రజల ప్రియతమ నేత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి మార్గదర్శం అన్నారు. భూస్వామ్య దోపిడీ పీడనకు వ్యతిరేకంగా, పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాలపై సుందరయ్య చేసిన అలుపెరగని పోరాటం ఆయనను చరిత్రలో చిరస్థాయిగా నిలిపాయని అన్నారు. 20ఏళ్ళ పాటు పార్లమెంట్, శాసన సభ సభ్యునిగా, ప్రజా ప్రతినిధిగా పనిచేసిన సుందరయ్య నిరాడంబరంగా సైకిల్ పైనే పార్లమెంటుకు, అసెంబ్లీకి వెళ్లి ప్రజావాణిని వినిపించారని అన్నారు. భూమి, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణలో జరిగిన సాయిధరైతంగా పోరాటానికి నాయకత్వం వహించిన సుందరయ్య 10 లక్షల ఎకరాల భూములను పేదలకు పంపిణీ చేయించారని అన్నారు. సిపిఎం అఖిలభారత తొలి ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘ కాలం నాయకత్వం వహించిన సుందరయ్య కడదాకా సమ సమాజ స్థాపన కోసం ఆహారహరం శ్రమించారని అన్నారు. అనేక నిర్బంధాలు ఎదుర్కొని నిలబడ్డారని, జైలు జీవితాన్ని గడిపారని అన్నారు. సుందరయ్య జీవితం స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలకు సిపిఎం శ్రేణులు సిద్ధం కావాలని కోరారు. తొలుత కోట వెంకటేశ్వరరెడ్డి కళాకారుల బృందం విప్లవ గీతాలు ఆలపించారు. సభలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు టి కృష్ణమోహన్, పి కొండయ్య, భాస్కరరావు, లక్ష్మణ, నూతలపాటి కోటేశ్వరరావు, రంగారెడ్డి, రాజు వెంకారెడ్డి, సుబ్బారెడ్డి, సుభాషిణి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యార్థినిని సత్కరిస్తున్న ఆమంచి కృష్ణమోహన్

విద్యార్థినికి మాజీ ఎమ్మెల్యే ఆమంచి అభినందనలు

ప్రజాశక్తి - వేటపాలెం

చీరాల శ్రీ గౌతమి కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో స్టేట్ సెకండ్ ర్యాంక్, జిల్లా ప్రథమ స్థానం సాధించిన గాయత్రి బిల్డర్స్ అధినేత దేవన వెంకట శివకుమార్ కుమార్తె గీతిక 467 మార్కులు సాధించిన సందర్భంగా ఆమెను మాజీ శాసన సభ్యులు ఆమంచి కృష్ణమోహన్ తన నివాసంలో అభినందించారు. తల్లి, దండ్రులకు అభినందనలు తెలిపారు. విద్యార్థిని గీతికకు జ్ఞాపిక, నగదు బహుమతి అందజేసి శాలువాతో సన్మానించారు. శ్రీ గౌతమి కాలేజీ యాజమాన్యంకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోనంకి నాగయ్య, డికె మాస్టర్, మాజీ సర్పంచ్ పి మోహన కుమారి, వోలుకుల మోహనరావు, బండ్ల బాబు, యారాసు అరుణ్ బాబు, కుర్మా రాహుల్జీ, నాసిక జగన్, గౌరాబత్తుని సాయి, గౌరాబత్తుని బాబురావు, గుత్తి సదాశివం, దేవన గంగాధరరావు, కొలుకుల రామాంజనేయులు, పిచ్చుక భార్గవ్, కర్ణ పోలయ్య, దోగుపర్తి రాజేష్, పృథ్వి ఉదయ్ కుమార్, పెరిసేట్ల శ్రీమన్నారాయణ, గౌరాబత్తుని బుల్లియ్య, గుంటూరు శ్రీనివాసరావు, యూత్ బాబు, చింతా రత్నం, తలతోటి డేవిడ్ పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న రోటరీ సభ్యులు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆశ్రయ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం భోజన వసతి కల్పించడంతోపాటు పండ్లు పంపిణీ చేశారు. రోటరీ సభ్యుడైన నాగబైరు శ్రీనివాసరావు కుమారుడు వంశీకృష్ణ, గాయత్రీ దంపతుల 3వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించినట్లు రోటరీ అధ్యక్షుడు కృష్ణమోహన్ తెలిపారు. దాత నాగబైరు శ్రీనివాసరావుకు వృద్ధాశ్రమ నిర్వాహకులు, వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు. ఆశ్రమంలోని వృద్ధులకు వేసవి మే నెల మొత్తం మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి, కోశాధికారిరులు కోమటి ఆంజనేయులు, పంబి సదానందరెడ్డి, మున్నంగి వెంకటసుబ్బయ్య, కోట శ్రీనివాసరావు, కోడూరి సుబ్రహ్మణ్యచారి, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి - అద్దంకి

అద్దంకి డివిజన్‌లోని మార్టూరు జాతీయ రహదారి ప్రక్కన గల ఇంటూరి ఫంక్షన్ హాల్ అండ్ రెసిడెన్సీ నందు గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం ఒక గంట వరకు విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. సదస్సుకు రిటైర్డు జడ్జి ఎన్ విక్టర్ ఇమ్మానియేలు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ఈ సదస్సు నందు విద్యుత్ బిల్లుల్లో తేడాలు, వోల్టేజ్ సమస్యలు, ఇతర విద్యుత్ సమస్యలపై వినతులు స్వీకరించి తక్షణం పరిష్కరించనున్నట్లు ఎఇ ఎన్ మస్తాన్‌రావు తెలిపారు. బాపట్ల జిల్లా ఎస్‌ఇ ఆంజనేయులు హాజరవుతారని తెలిపారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

నీటి తీరువాకు వడ్డీ వసూలు చేయొద్దు..

మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

రైతుల నుంచి నీటి తీరువాకు వడ్డీ వసూలు చేయరాదని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. జిల్లా అభివృద్ధి మండలి సమీక్షా సమావేశం స్థానిక కలెక్టరేట్‌లోని విసి హాల్లో కలెక్టర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. జల వనరులు, వ్యవసాయ, జాతీయ ఉపాధి హామీ పథకం, పర్యాటక రంగం తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ తక్షణమే వడ్డీ రాయితీని అమలు చేయాలని అన్నారు. రైతుల నుంచి కేవలం నీటి పన్ను మాత్రమే వసూలు చేయాలని స్పష్టం చేశారు. చెరువుల పూడికతీత పనులలో భాగంగా చెరువుల కట్టలను బలోపేతం చేయాలని అన్నారు. వర్షాలు వచ్చేలోగా పనులు శరవేగంగా చేపట్టాలని అన్నారు. జల వనరులు, మైన్స్ అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. గుండ్లకమ్మ నదిపై మల్లవరం ప్రాజెక్ట్ గేట్లు పూర్తిగా మరమ్మతులు చేయాలని అన్నారు. పనులు ఎట్టి పరిస్థితుల్లో ఆపరాదని, నిధులు తెప్పించే బాధ్యత తీసుకుంటామని అన్నారు. ఎత్తిపోతల పథకం కింద ఉన్న ప్రాజెక్టుల మరమ్మతులకు పునరుద్ధరణ ధరలతో అంచనాలపై నివేదిక పంపాలని అన్నారు. పమిడిమర్రు ఎత్తిపోతల పథకం అంచనాలను రూపొందించాలని అన్నారు. ఈ పనులు వేగంగా జరగడానికి తాత్కాలిక పద్ధతిలో సిబ్బందిని నియమించాలని చెప్పారు. తక్షణమే ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలన్నారు.

ఎత్తిపోతల పథకాల పనులు వేగంగా చేపట్టాలి


మంత్రి ఎ సత్యప్రసాద్

ఎత్తిపోతల పథకాల పనులు వేగంగా చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. మీరు పనులు చేయండి, నిధులు మంజూరు చేయిస్తామని అన్నారు. వేలాది ఎకరాల సాగు పెరగడంతోపాటు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. నీటి తీరువా వసూలులో భూమి అమ్మిన వారి పేర్లు కూడా ఆన్‌లైన్‌లో చూపిస్తున్నాయన్నారు. తద్వారా భూ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, వాటిని నివారించాలని అన్నారు. చెరువుల పూడిక తీత పనులు వేగంగా చేపట్టాలని ఆయన సూచించారు.

సమావేశం అనంతరం ఫోటోలు దిగుతున్న మంత్రులు

జలజీవన్ మిషన్ పనుల్లో అలసత్వం వద్దు

ఎంపీ కష్ణ ప్రసాద్

జల జీవన్ మిషన్ కింద మంజూరైన రూ.532 కోట్ల విలువైన పనులు చేయకపోవడంతోనే నిధులు మురిగిపోయాయని బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కష్ణ ప్రసాద్ అన్నారు. జిల్లాలో 1,080 పనులు నిలిచిపోవడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధికి, జిల్లా ప్రజలకు నష్టం జరుగుతుంటే అధికారులు చూస్తున్నారా అంటూ నిలదీశారు. ఉపాధి పనులు తక్కువగా చేయడం ద్వారా జిల్లాకు నష్టం వాటిల్లిందన్నారు. వేమూరు నియోజకవర్గంలో గతేడాది కేవలం 62.80 శాతం పనులు జరగడం ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో పర్యాటకులు పెరగడానికి పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలన్నారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధన దిశగా యంత్రాంగం

జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి

ప్రభుత్వ లక్ష్యాల సాధన దిశగా ప్రభుత్వ యంత్రాంగం అడుగులు ముందుకు వేస్తోందని కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనలు, ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించడానికి యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. పొగాకు సాగు చేసే సమయంలో కంపెనీలు ఒత్తిడి చేసి సాగు విస్తీర్ణం పెంచాయని అన్నారు. ఇప్పుడు కొనుగోలు చేయకుండా ఉంటే అలాంటి కంపెనీలపై క్రిమినల్ కేసులు పెట్టే అంశాన్ని పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వదేశీ దర్శన్-2 కింద సూర్యలంక బీచ్‌ని అభివృద్ధి చేస్తామని కలెక్టర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.97కోట్లు పర్యాటకానికి నిధులు విడుదలయ్యాయన్నారు. అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచే ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధి చేసే అంశాలపై పిపిటి ద్వారా వివరించారు. వాడరేవు-పిడుగురాళ్ల, గుంటూరు-నిజాంపట్నం, ఓడరేవు వరకు జాతీయ రహదారులు, 216 జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయని అన్నారు. అద్దంకి రేంజ్ ఏర్పాటుకు భూసేకరణ చేపట్టామని అన్నారు.

కంపెనీలు పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి


పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంభివరావు

పొగాకు పంటను రైతుల వద్ద నుంచి కంపెనీలు కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివ రావు కోరారు. రానున్న సంవత్సరంలో ఇలాంటి సమస్య తలెత్తకుండా సాగులో నియంత్రణ ఉండేలా చూడాలని అన్నారు. సాగునీరు ముందుగా విడుదల అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉపాధి హామీ పనులకు పెండింగులో ఉన్న బిల్లులు చెల్లించాలని అన్నారు.

ఎత్తిపోతల పథకాల మరమ్మత్తులు చేయించాలి

చీరాల ఎమ్మెల్యే ఎం మాల కొండయ్య

ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేయాలని చీరాల శాసన సభ్యులు ఎం మాల కొండయ్య మంత్రిని కోరారు. వాటికి నిధులు కేటాయించి వేలాది ఎకరాలకు సాగునీరు అందించాలని కోరారు. రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. చీరాల నియోజకవర్గంలో ఉపాధి పనులు అధికంగా కేటాయించి, పేదలకు ఉపాధి చూపాలని కోరారు. సమావేశంలో గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హెన్రీ క్రిస్టీనా, బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ, వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు, జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు.


స్వయం సహాయక సంఘాలకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి 5
గురువారం 22 మే 2025

ఇళ్లస్థలాల దరఖాస్తులు సమగ్రంగా పరిశీలించండి

కలెక్టర్లకు సిసిఎల్ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన చేసి ఆన్ లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సిసి ఎల్‌ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి జిల్లా కలెక్టర్లకు సూచించారు. విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి బుధవారం రెవెన్యూ అంశాలు, రీ సర్వే, నివేశన స్థలాల వెరిఫికేషన్ ప్రక్రియ వంటి అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిసిఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిసి ఎల్‌ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటిపట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ పటిష్ఠంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో రీసర్వే ప్రక్రియ పటిష్ఠంగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఒంగోలు కలెక్టరేట్ నుండి కలెక్టర్ తమీమ్‌అన్సారియా పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇంటి పట్టాల వెరిఫికేషన్ ప్రక్రియ పటిష్ఠంగా చేపడుతున్నట్లు వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ బాషా పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

రీ వెరిఫికేషన్ చేస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఇళ్ల పట్టాలపై రీవెరిఫికేషన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలో ఇంటి పట్టాలకు సంబంధించిన రీవెరిఫికేషన్‌ను సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ట్రీ సర్వీస్ సందర్భంగా చేపట్టాల్సిన అంశాలపై జేసీ పలు సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ వెంట ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు, ఒంగోలు అర్బన్ తహశీల్దార్ మధుసూదన్‌రావు ఉన్నారు.

25న వైసిపి నియోజకవర్గ విస్తృత సమావేశం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మాట్లాడుతున్న రవిబాబు

ఈ నెల 25న వైసిపి ఒంగోలు నియోజకవర్గ విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబు పేర్కొన్నారు. బుధవారం నాడు ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాట్లు నిర్వహణపై కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ విస్తృత స్థాయి సమీక్షా సమావేశానికి రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వై.పాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్‌రావు, శాసనమండలి సభ్యులు తూమాటి మాధవరావు, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రులు డాక్టర్ ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున హాజరుకానున్నట్లు వారు తెలిపారు. సమావేశంలో నాయకులు కటారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

'రాజీవ్‌గాంధీ'కు ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

భారతదేశ సమాచార పితా మహుడుగా మాజీ ప్రధాని, కీర్తి శేషులు రాజీవ్‌గాంధీ నిలిచారని కాంగ్రెస్ పార్టీ ఒంగోలు అసెంబ్లీ కోఆర్డినేటర్ బిఆర్ గౌస్ తెలిపారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి పురస్కరించు కొని ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బి.ఆర్ గౌస్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి, స్థానిక మంగమూరు రోడ్డులోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం కార్యనిర్వాహక అధ్యక్షులు ఉద్దండి మల్లికార్జునరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ మన్నం ప్రసన్న రాజు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు షేక్ రసూల్, గోరంట్ల కోటేశ్వరరావు, పైనం మధు, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ సుదర్శి రవి, జిల్లా సోషల్ మీడియా చైర్మన్ సుధీర్ వర్మ, ఒంగోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెలగలపూడి బుజ్జి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి జాకబ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ సుభాన్, షేక్ ఇమామ్, అంకబాబు పాల్గొన్నారు.

యోగా సాధనతో ఆరోగ్యకర జీవితం

కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

యోగా చేస్తున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా, అధికారులు, ప్రజాప్రతినిధులు

దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ యోగాను నిత్యసాధన చేస్తే ఆరోగ్య కరమైన జీవితం సాకారమవుతుందని కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా పేర్కొన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహక ఏర్పాట్లలో భాగంగా బుధవారం ఉదయం ఒంగోలు నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో జరిగిన మెగా యోగా సాధనలో కలెక్టర్ తమీమ్‌అన్సారియా, సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్.విజయకుమార్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఏపి పర్యటకాభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21న నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రంలోని విశాఖకు వస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యోగాపై పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో రాబోయే నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్.విజయకుమార్ మాట్లాడుతూ యోగా శరీరక, మానసిక, ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుందని, మనస్సును ప్రశాంతంగా ఉంచుతుందని పేర్కొన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ యోగాతో మనస్సు, శరీరం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ రోజుకు అర్ధగంట పాటు యోగా సాధన చేయడం మానసిక ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఆరోగ్య కరమైన జీవనం సాగించడానికి ఎంతో సహాయపడుతుందన్నారు. ఏపి పర్యటకాభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతి లో యోగా ఒక భాగమని, దీనిని అందరూ అభ్యసించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం కల్పించాలన్న ఉద్దేశ్యంతో పదేళ్ల క్రితం ప్రధాని నరేంద్రమోడీ యోగా దినోత్సవానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ప్రతిఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలన్నారు. ప్రతిరోజూ యోగా చేస్తూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాబోయే నెల రోజుల పాటు ఒక ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ తయారు చేసుకొని జిల్లావ్యాప్తంగా ప్రతి గ్రామంలో యోగ సాధన చేసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా యోగా గురువు పతంజలి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో విద్యార్థులు, యోగ సాధకులు, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఆయుష్ శాఖ ఆర్డీడీ పద్మజాతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సిపిఎం సానుభూతిపరుడు శ్రీనివాసరెడ్డి మృతి

ప్రజాశక్తి-పెద్దారవీడు

శ్రీనివాసరెడ్డి (ఫైల్)

మండల పరిధిలోని సానికవరం గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతిపరుడు పొందుగుల శ్రీనివాసరెడ్డి(56) బుధవారం ఉదయం మృతి చెందారు. ఆయన గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శ్రీనివాసరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐలో పనిచేశారు. విద్యార్థి ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారు. ఆ తరువాత డివైఎఫ్ఐలో, రైతు సంఘంలో పనిచేశారు. సిపిఎం సభ్యులుగా కూడా కొనసాగారు. ప్రజాశక్తి విలేకరిగా కూడా పనిచేశారు. ఆ తరువాత సిపిఎం సానుభూతిపరుడిగా ఉన్నారు. శ్రీనివాసరెడ్డి భౌతికకాయానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.సోమయ్య, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి శాసనాల వీరబ్రహ్మం, సీనియర్ జర్నలిస్టు ఎన్వి రమణ, సిపిఎం సానికవరం శాఖ కార్యదర్శి గోపిదేశి మల్లయ్య, సిపిఎం నాయకులు దొడ్డా సుబ్బారెడ్డి, పలువురు ప్రముఖులు నివాళి అర్పించారు.

తండ్రి అడుగుజాడల్లో..

శ్రీనివాసరెడ్డి తండ్రి పొందుగుల చలమారెడ్డి సిపిఎం మార్కాపురం డివిజన్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. ఆయన వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న శ్రీనివాసరెడ్డి విద్యార్థి సంఘమైన ఎస్ఎఫ్ఐలో పనిచేశారు. అనంతరం డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులుగా ఉంటూ మార్కాపురం, పెద్దదోర్నాల ప్రాంతాల్లో సంఘాన్ని ప్రారంభించి దాని అభివృద్ధికి కృషి చేశారు. తదుపరి రైతు సంఘంలో చేరి రైతు సమస్యలపై పనిచేశారు. కరువు, విద్యుత్ లోవోల్టేజీ, వెలిగొండ ప్రాజెక్టు తదితర సమస్యలపై పనిచేసి రైతుల అభిమానం చూరగొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఆవశ్యకతపై ప్రజలను చైతన్యవంతం చేస్తూ పుస్తకం కూడా వేశారు. అనంతరం ప్రజా సంఘాల్లో ప్రత్యక్షంగా లేనప్పటికీ పరోక్షంగా సహకరించేవారు. పొందుగుల శ్రీనివాసరెడ్డి చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొండారెడ్డి పేర్కొన్నారు.

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు జిల్లా విద్యాధికారి ఏ.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం నాడు జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు 36 కేంద్రాల్లో 619 మందికిగాను 368 మంది హాజరు కాగా 251 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. కాగా ఓపెన్ స్కూల్ పదో తరగతి తెలుగు పరీక్షకు 704 మందికి 551 మంది హాజరు కాగా 153 మంది గైర్హాజరు అయ్యారు. ఉర్దూ పరీక్షకు ఇద్దరకు ఇద్దరూ హాజరయ్యారు. ఇంటర్ కెమిస్ట్రీ పరీక్షకు సంబంధించి 1097 మందికి గాను 929 మంది హాజరు కాగా 168 మంది గైర్హాజరు అయినట్లు పేర్కొన్నారు. ఎకనామిక్స్ పరీక్షకు 510 మందికి 429 మంది హాజరు కాగా 153 గైర్హాజరు అయ్యారు. 15 కేంద్రాలలో డిఇఒ, స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించగా అంతా ప్రశాంతంగా జరుగుతున్నట్లు అధికారులు ప్రకటించారు.

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు, కర్నూల్‌రోడ్డులోని బైపాస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి సౌజన్యంతో జెరావు కళాబందం హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. 2017 యాక్ట్ గురించి, 1097 టోల్ ఫ్రీ గురించి, రక్తదానం ఆవశ్యకతను గురించి కళాకారులు ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రో స్వచ్ఛంద సేవాసంస్థ మేనేజర్ పీరుబాషా, ఏఎన్ఎం పద్మ, సిబ్బంది పాల్గొన్నారు..

పిల్లల పోస్టర్ కేర్ దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జిల్లా బాలల సంరక్షణ విభాగం (డిసిపియు) సంరక్షణలో ఉన్న పిల్లలను పోస్టర్ కేర్ తీసుకునేందుకు ఆసక్తి కలిగిన కుటుంబాల నుంచి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ హెనా సుజన్ బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధీనంలో ఉన్న చైల్డ్ కేర్ ఇన్ స్టిట్యూషన్‌లోనే ఆశ్రయం పొందుతున్న రక్షణ మరియు సంరక్షణ లేని 6 నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లలను పాక్షిక దత్తత ఇచ్చేందుకు ఆసక్తి కలిగిన తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పిల్లల పాక్షిక దత్తత సంబంధించిన పూర్తి సమాచారం కోసం జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, రామ్ నగర్, 3వ లైన్, ఒంగోలు, ప్రకాశం జిల్లా లో ఉన్న జిల్లా బాలల సంరక్షణ విభాగం కార్యాలయం నందు అధికారుల్ని సంప్రదించాలని ఆమె సూచించారు. మరింత సమాచారం తెలుసుకునేందుకు ప్రాజెక్ట్ డైరెక్టర్ మరియు జిల్లా బాలల సంరక్షణ అధికారి, ఫోన్ నెంబర్లు : 9440814506, 9676404743ను సంప్రదించాలని కోరారు.

భాగ్యనగర్‌లో ప్రత్యేక పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పారిశుధ్య పనులు చేయిస్తున్న దృశ్యం

నగరంలోని భాగ్యనగర్ 4వ లైన్‌లో రోడ్డుమార్జిన్‌లో ప్రత్యేక పారిశుధ్య పనులను శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

25న ఆత్మకూరి చెన్నయ్య వర్ధంతి సభ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బహుజన పోరాటయోధుడు ఆత్మకూరి చెన్నయ్య పదవ వర్ధంతి సభ ఒంగోలు సిపిఐ ఆఫీసులో ఈ నెల 25న సాయంత్రం ఐదు గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరి చెన్నయ్య స్మారక సమితి కన్వీనర్, న్యాయవాది కాటుకూరి బాబూ రావు తెలిపారు. ఈ మేరకు ఒంగోలు అంబేద్కర్ భవనంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్మారక సమితి ప్రతినిధులు దుగ్గినపల్లి ఎజ్రా శాస్త్రి, డాక్టర్ నూకతోటి రవికుమార్, పారాబత్తిన బ్రహ్మయ్య, కనపర్తి శివరాం, వెంకటేశ్వర్లు, కాకుమాను కిరణ్ కుమార్, కోటేశ్వరరావు, కొండలరావు పాల్గొన్నారు.

పరీక్షలకు హాజరైన విద్యార్థులు

ఇఏపిసెట్
ఎంపీసీ స్ట్రీం పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఏపిఈఏపిసెట్ ఎంపీసీ స్ట్రీం పరీక్షలు బుధవారం ప్రారంభమైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణా రావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె జగదీష్ బాబు మాట్లాడుతూ ఏపి ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో కాకినాడ జెఎన్‌టియు పర్యవేక్షణలో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష కళాశాలలోని అత్యాధునిక ల్యాబ్స్‌లో నిర్వహించామని చెప్పారు. ఆన్‌లైన్ విధానంలో జరిగిన పరీక్షలకు ఉదయం 243 మందికి 235 మంది, సాయంత్రం 230 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

సూర్యఘర్‌తో ఉచిత విద్యుత్

ప్రజాశక్తి - యద్దనపూడి

ఎంపిడిఒ పిటివి కృష్ణ

ప్రధానమంత్రి పీఎం సూర్య ఘర్ ప్రతి ఇంటికి రూఫ్ టాప్ సోలార్ ప్యానెల్స్ అమర్చుకోవడం ద్వారా 300 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ పొందవచ్చని ఎంపిడిఒ పిటివి కృష్ణ బుధవారం తెలిపారు. 3 కెవి సోలార్ యూనిట్‌కు రూ.2.10లక్షలు ఖర్చవుతుందని దీనిలో లబ్ధిదారుని వాటా రూ.20వేలు చెల్లిస్తే ప్రభుత్వం రూ.78వేలు సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. మిగిలిన రూ.1.12లక్షలు వాయిదాల పద్ధతిలో బ్యాంకుకు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే ఇంటి యజమానికి 300యూనిట్లు వస్తుందని తెలిపారు. దాదాపు ఇంటికి కరెంటు బిల్లు పూర్తిగా ఉచితం అవుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన లబ్ధిదారులు ఇంటి కరెంటు బిల్లు, ఇంటి పన్ను, ఆధార్, బ్యాంకు పుస్తకం జెరాక్స్ కాపీలు తీసుకుని సచివాలయం, లేదా ఇంటర్ నెట్ సెంటర్లలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మినీ మహానాడుకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - అద్దంకి

నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే తెలుగుదేశం కార్యకర్తల పండుగ (మినీ మహానాడు) పట్టణంలో గురువారం ఉదయం 10 గంటలకు నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కళ్యాణ మండపంలో జరుగుతుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా ఈ ఏడాది కడపలో రాష్ట్ర స్థాయి మహానాడు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే క్షేత్రస్థాయిలో కార్యకర్తలను భాగం చేసేలా నియోజకవర్గ స్థాయిలో మినీ మహానాడు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తెలుగుదేశం కార్యకర్తలు పండుగలా జరుపుకునే మహానాడులో భాగంగా చిరు వ్యాపారులకు 150 తోపుడు బండ్లను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమమే తెలుగుదేశం లక్ష్యమని అన్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ఆవిర్భవించిన తెలుగు దేశం గత 43ఏళ్లలో తెలుగు ప్రజల కీర్తి ప్రతిష్టలను ప్రపంచ స్థాయిలో నిలిపిందని అన్నారు. సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్‌టిఆర్ అన్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడి ఆసుపత్రుల బిల్లులతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న 100 మందికి రూ.60.55 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించనున్నట్లు తెలిపారు.

గిరిజనులకు ఉపాధి పనులు దక్కటం లేదు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

సమాజంలో అధిక శాతం వ్యవసాయ కూలి పనులు చేసే దళిత, గిరిజనులకు ఎంజి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు పూర్తిస్థాయిలో దక్కడం లేదు. సామాజిక వర్గాలతో పని లేకుండా జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఈ పథకం కింద పని చేసుకుని వెసులుబాటు ఉంది. కానీ ప్రస్తుతం ఎలాంటి వ్యవసాయ పనులు లేకపోవడంతో మండలంలో వివిధ గ్రామాల్లో అధిక శాతం బిసి వర్గాలకు చెందిన వారు జాబు కార్డు కలిగి అధిక మొత్తంలో గ్రూపులుగా ఏర్పడడంతో జరిగే పనులు ఎక్కువ శాతం వారికే దక్కుతున్నాయి. రైతు, కౌలు రైతు వారీగా ఆర్థిక స్తోమత కలిగిన వారు సైతం జాబు కార్డు పొంది ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లడంతో అణగారిన వర్గాలైన దళిత, గిరిజనులకు రోజువారి పనులు అందటం లేదు. దీని కారణంగా ఆయా గ్రామాల్లో ఉన్న దళిత, గిరిజనులకు ఈ ఏడాది ఇప్పటి వరకు ఒక్కో కుటుంబానికి రెండు, మూడు వారాలకు మించి పని దక్కలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రూపులకు ఒక వారం పని జరిగితే మరొక వారం పని మంజూరు కాక ఖాళీగా ఉండాల్సిన దుస్థితి ఏర్పడుతుందని కూలీలు వాపోతున్నారు. ఈ పథకం పని ఆరంభంలో ఎస్సీ, ఎస్టీలు మినహా ఏ ఒక్కరూ ఉపాధి పనికి వెళ్లేవారు కాదని, ప్రస్తుతం ప్రభుత్వం గృహాలు నిర్మించుకునే వారికి సైతం జాబు కార్డును మంజూరు చేయటంతో వాళ్లు కూడా ఈ పనులకు వెళుతుండటతో తమకు పూర్తిస్థాయిలో పని లభించక వస్తువులు ఉండాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

డెల్టా ప్రాంతం కావడంతో పనులు తక్కువే

మెట్ట భూముల్లో నిత్యం ఏదో ఒక పంట కొనసాగుతూ ఉంటుంది. ముఖ్యంగా మాగాణి భూములున్న ప్రాంతాల్లో చిన్న, చిన్న పంట కాలువలు మినహా ఉపాధి హామీ పనులు చేయటానికి ఎలాంటి పనులు ఉండవు. ఈ పనులు జరిపించడానికి ఉన్న కూలీలతో రెండు, మూడు వారాలు పనిచేస్తే కాలువలు పూర్తవుతుంటాయి. అది కూడా గ్రూపులన్నిటికీ పని దక్కదు. వీటికి అనుసంధానంగా ఉన్న ఇరిగేషన్ కాలువలు, మురుగు నీటి పారుదల కాలువలు ఈ ఏడాది అధికారులు జెసిబిల ద్వారా పూడిక తీత చేపట్టాలనే దృక్పథంతో వాటిని ఉపాధి హామీ పథకం నుండి మినహాయించారు. దీనివలన కూడా ఈ ఏడాది కూలీలకు పూర్తిస్థాయిలో ఉపాధి పని దక్కే పరిస్థితి లేదు. గత కొద్ది కాలంగా అధిక వర్షాల సమయంలో మురుగు నీరు పారుదల లేక పంట పొలాలు దెబ్బతింటున్న దృష్ట్యా మురుగు నీటి కాలువలను జెసిబి ద్వారానే పూడిక తీసి పంట పొలాలను కాపాడాలనే దృక్పథంతో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటన్నిటి దృష్ట్యా ఉపాధి హామీ పథకం పనులపై ఆధారపడి జీవించే దళిత, గిరిజనులకు ప్రత్యేకంగా గుర్తించే పనులను కేటాయించి జరిపిస్తే నూరు శాతం పనులు కల్పించకపోయినా కొంతమేరకైనా ఉపాధి లభిస్తుందని, ఆ మేరకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఐటిసిలో బదిలీ కార్మికులను క్లాస్ బీగా చేయాలి

ఐఎల్‌టిడి ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి

ప్రజాశక్తి - చీరాల

స్థానిక ఐఎల్‌టిడిలో బదిలీ కార్మికులను క్లాస్ బీగా చేస్తామని యాజమాన్యం చెప్పి రోజులు గడుస్తున్నప్పటికీ అమలు చేయలేదని, తక్షణమే వారిని క్లాస్ బీగా చేయాలని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి అన్నారు. ఏపి ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్టిడి కంపెనీ వర్కర్స్ (సిఐటియు) ద్వారా ఐఎల్టిడిలో క్యాజువల్స్‌ను క్లాస్ బి వర్కర్‌గా చేయాలని కోరుతూ గుంటూరు కార్మిక శాఖ జెసిఎల్‌ను కలసి కోరికల పత్రం బుధవారం అందజేశారు. కాగా కెవైసి పేరుతో ఆపిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, బదిలీ బోర్డ్ చేయాలని, వివిధ అంశాలతో ఉన్న వినతి పత్రం ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి మాట్లాడుతూ గత ఐదేళ్ల నుండి చీరాల ఐఎల్టిడి కంపెనీలో క్యాజువల్స్‌గా పనిచేసిన వారిని 2018 లైన్ టు మేనేజ్మెంట్ నిలుపుదల చేయడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారని అన్నారు. 2025 ఏప్రిల్ 9న చీరాల బ్రాంచ్‌లో లైన్ టు తిరిగి ప్రారంభించిన క్యాజువల్స్‌ను క్లాస్ బీగా చేస్తామని యాజమాన్యం ప్రారంభోత్సవానికి ముందే చెప్పారని అన్నారు. యాజమాన్యం 130 మందిని క్లాస్ బీగా తీసుకుంటామని చెప్పి 40 రోజులు దాటిందని, కెవైసి పేరుతో ఆపిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. తమ కోర్కెల పత్రంపై జెసిఎల్ స్పందిస్తూ యాజమాన్యంతో మాట్లాడి ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు. జెసిఎల్‌ను కలిసిన వారిలో ఏపి ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు గోసాల సుధాకర్, ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు బి ముత్యాలరావు, నక్కల నాగరాజు పాల్గొన్నారు.

జెసిఎల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి

తిరుగులేని శక్తిగా టిడిపిని తీర్చిదిద్దేందుకు కృషి

ప్రజాశక్తి - బాపట్ల

తెలుగుదేశంకు బలమైన నాయకత్వాన్ని అందించి తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి కోరారు. స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లా మినీ మహానాడులో ఆయన మాట్లాడారు. సభకు బాపట్ల డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్ బాబు అధ్యక్షత వహించారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే మహానాడు విజయవంతం చేయాలని అన్నారు. ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం నిద్రాహారాలు మాని సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని అన్నారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ రూ.2లకే కిలో బియ్యం, కూడు, గూడు, అన్ని వర్గాల ప్రజలకు అందాలన్నదే ఎన్టీఆర్ ఆశయమని అన్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి మంత్రులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు తెలుగుదేశంను జిల్లాలో ఒక బలమైన శక్తిగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్, అద్దంకి మాజీ శాసన సభ్యులు చెంచు గరటయ్య, తాతా జయ ప్రకాష్ నారాయణ, సజ్జ హేమలత, పమిడి భాస్కరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని గ్రామాల్లో నల్లబర్లీ పొగాకు సాగు చేసిన రైతులు తమ పేర్లను రైతు సేవ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. బుధవారం పర్చూరు విచ్చేసిన ఆయన చీరాల రోడ్డులో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మి కాంప్లెక్స్‌ను సందర్శించారు. స్థానిక టిడిపి నాయకులు, గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయన పొగాకు రైతులతో మాట్లాడారు. నల్లబర్లీ పొగాకు రైతులు ఎంత సాగు చేశారో, ఇప్పటివరకు ఎంత పొగాకు అమ్మారు? మిగిలిన పొగాకు ఎంత నిల్వ ఉన్నదో దగ్గర్లోని రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేయాలని చెప్పారు. కేవలం మూడు రోజులు మాత్రమే నమోదుకు సమయం ఉన్నదని, పొగాకు రైతులందరూ అప్రమత్తంగా ఉండి వివరాలు అందజేయాలని చెప్పారు. మూడు రోజుల తర్వాత నమోదుకు వీలుపడదని చెప్పారు. గ్రామాల్లో నాయకులు రైతులకు తెలియచెప్పి వివరాలు నమోదు అయ్యేటట్లు చూడాలని కార్యకర్తలకు ఆదేశించారు. సేకరించిన వివరాలన్నీ ప్రభుత్వానికి పంపించి రైతుల వద్ద ఉన్న పొగాకు కొనుగోలు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రంలో యోగా దినోత్సవం

ప్రజాశక్తి - వేమూరు

నియోజకవర్గంలోని చుండూరు మండలం మోదుకూరు ఐసిడిఎస్ సెక్టార్ పరిధిలోని మండూరు అంగన్‌వాడి కేంద్రంలో బుధవారం యోగా దినోత్సవం నిర్వహించారు. సూపర్వైజర్ పెరికల నాగరాజ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, గ్రామస్తులకు యోగా చేసే విధానాన్ని సూపర్వైజర్ చూపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా వలన ప్రతి ఒక్కరికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. నిత్యం యోగా చేయటం వలన మనిషిలో అవయవాలు కదిలి ఆరోగ్యవంతంగా ఉంటారని చెప్పారు. యోగాకు వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ లింగ బేధం లేకుండా జరిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, చిన్నారులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే లక్ష్యం

టిడిపి మినీ మహానాడులో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - రేపల్లె

తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం పుట్టిన తెలుగుదేశం పార్టీ పేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే లక్ష్యంగా పనిచేస్తుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గం మహానాడులో ఆయన మాట్లాడారు. తొలుత పాకిస్తాన్‌పై జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన భారత జవాన్‌లకు నివాళులార్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 43ఏళ్ల టీడీపీ ప్రస్థానంలో తెలుగు ప్రజలు శాసించే స్థాయికి చేరారని అన్నారు. తెలుగు ప్రజల కీర్తి ప్రతిష్టలు ఇనుమడింప చేయడంలో టీడీపీ కీలక పాత్ర పోషించిందని అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో కీలక వ్యక్తిగా ఉన్నారని చెప్పారు. గత ప్రభుత్వ రాక్షస పాలన నుండి విముక్తి కోసం 93శాతం విజయంతో అఖండ మెజార్టీ ఇచ్చిన ఘనత తెలుగు ప్రజలదని అన్నారు. ఇంత భారీ స్థాయి విజయం దేశంలో ఏ పార్టీకి, ఏ కూటమికి సాధ్యపడలేదని అన్నారు. తెలుగు ప్రజలు చాలా తెలివైనవారని, 2019లో మోసపోయామని గ్రహించి 2024లో కూటమికి అఖండ మెజార్టీ ఇచ్చారని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వం అప్పులు తెచ్చి పథకాల పేరుతో స్కాంలు చేసి వారి జేబులు నింపుకున్నారు కాబట్టే ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా అప్పులు చేస్తోందని, సంపద పెంచి అప్పులు తీర్చే ఆలోచన చేయటం కూటమి ప్రభుత్వానికే సాధ్యమని అన్నారు. సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలకు అదనంగా మరికొన్ని హామీలు అమలు చేస్తున్నామని చెప్పారు. రెవెన్యూ శాఖలో గత ప్రభుత్వ నేతలు చిక్కుముడులు వేశారని అన్నారు. అటవీ, పేదల భూములు దోచుకున్నారని ఆరోపించారు. వీరందరిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం తప్పుదన్నారు. అటువంటి పాలకులు మరోసారి అక్రమాలకు పాల్పడేందుకు అవకాశం లేకుండా వ్యవస్థలన్నీ ప్రక్షాళన చేస్తున్నామని చెప్పారు. ఆర్థికంగా కష్టాలు ఉన్నప్పటికీ ఇచ్చిన మాట మేరకు మహిళలకు ఉచిత బస్సు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. చంద్రబాబు పాలన కారణంగా భవిష్యత్తుపై నమ్మకంతో ఓటర్లంతా సంతోషంగా ఉన్నారని అన్నారు. పార్టీ కార్యకర్తలు సంతోషంగా ఉండేలా చూసుకోవటం తన బాధ్యతని అన్నారు. పార్టీ కష్టకాలంలో కార్యకర్తలంతా రక్షణ కవచంలా నిలిచారని అన్నారు. పార్టీ కార్యకర్తల మనస్సుల్లో ఎప్పుడూ తనకు స్థానం ఉండాలనేది తన లక్ష్యం అన్నారు. కార్యకర్తలంతా తన కుటుంబ సభ్యులని, కార్యకర్తల త్వాతే తనకు ఎవరైనా అని, కార్యకర్తలకు మించిన ఆత్మీయులు తనకు లేరని ప్రస్తావించారు. ప్రతి కార్యకర్తకూ ఏదో ఒక సమయంలో అవకాశం వస్తుందని, ప్రతి ఒక్కరినీ బాగా చూసుకునే బాధ్యత తమదని అన్నారు.

మహానాడులో మాట్లాడుతున్న మంత్రి సత్యప్రసాద్

రేపల్లె అభివృద్ధి ముఖ్యం

రేపల్లె ప్రాంత అభివృద్ధి ముఖ్యమని, ఆ తర్వాత కార్యకర్తల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని భరోసా ఇచ్చారు. నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా కుప్పం, మంగళగిరి, పిఠాపురం తరహాలో అభివృద్ధి చేస్తామని చెప్పారు. పల్నాడులో వైసీపీ గూండాల చేతిలో హత్యకు గురైన తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చామని అన్నారు. బాపట్ల ఎంపి తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పి4 విధానంలో ప్రతి ఇంటి నుండి ఒకరిని సూక్ష్మ పారిశ్రామికవేత్తగా తయారు చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల్లో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఈనెల 27, 28, 29 తేదీల్లో వైఎస్ఆర్ కడప జిల్లాలో జరిగే మహానాడుకు తరలిరావాలని కార్యకర్తలు, నాయకులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు ఎం వెంకటసుబ్బయ్య, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జి శ్రీనివాసరావు, కృష్ణ పశ్చిమ దళిత ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పి మురళీధరరావు, నియోజవర్గ పరిశీలకులు మలినీడు రామస్వామి, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖరబాబు, మంత్రి సోదరుడు శివప్రసాద్, జడ్పిటిసి నర్రా సుబ్బయ్య, మాజీ జడ్పిటిసి ఎం శివరామకృష్ణ, టిడిపి నాయకులు జివి నాగేశ్వరరావు, తాత ఏడుకొండలు, సిహెచ్ నాగమల్లేశ్వరరావు, టి మల్లికార్జునరావు, వి శివసుబ్రహ్మణ్యం, ధర్మ తేజ, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, ఓ వెంకట్ యాదవ్, దివి రాంబాబు, కూచిపూడి మోహనరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు పట్టాభి రామారావు, రూరల్ అధ్యక్షులు రామాంజనేయులు, టిడిపి ఎస్టి సాధికారిక కమిటీ జిల్లా అధ్యక్షులు టి శ్రీనివాసరావు, కేశన రామకృష్ణ, మల్లాది రామకృష్ణ, శ్రీనివాసరెడ్డి, చింతల సుబ్బారావు, మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, తెలుగు మహిళ ప్రతినిధులు డి జయప్రద, బి లక్ష్మీనరసమ్మ, తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు గౌరీ రామకుమారి, మాజీ జెడ్పిటిసి ఎం శివమ్మ, మాజీ ఎంపీపీ కారుమూరి జ్యోతి, ఎఎంసి చైర్మన్ ఎం అనురాధ, భాస్కరరావు, వైస్ చైర్మన్ గోగినేని వసుధ, వై శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - ముండ్లమూరు

దర్శి పట్టణంలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఈనెల 25న విశ్వబ్రాహ్మణ విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీ జరుగుతుందని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు చెన్నుపాటి శ్రీనివాసరావు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐఐటి, ఎన్ఐటి, ఐఐఐటి, ఎన్ఈఇటి ద్వారా ఎంబీబీఎస్ సీట్లు పొందిన విద్యార్థుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు అభినందన, ప్రతిభా పురస్కారాల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎపి ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రభుత్వ బిసి కమిషన్ సభ్యులు కుందుర్తి గురవాచారి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సింహాద్రి కనకాచారి, కొండముది బంగారు బాబు, పిసిపల్లి ఎంఇఒ రాచగుండ్ల శ్రీనివాసులు హాజరవుతున్నారని తెలిపారు. అర్హులైన 80 మంది విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వెంకట్రావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిఐ సుబ్బరాజు

గుండె పోటుతో యువకుడు మృతి

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన చేతరాజుపల్లి వెంకట్రావు (25) తన వ్యక్తిగత పనులపై పట్టణంలోని ఒక దుకాణం వద్ద నిలబడి ఉండగా ఆ సమయంలో గుండెపోటు రావడంతో కుప్ప కూలిపోయాడు. అక్కడే ఉన్న యువకులు సిపిఆర్ చేసి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు అతనిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. సమాచారం అందుకున్న సిఐ సుబ్బరాజు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి మృతుని వివరాలు వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

ఆ... రహదారిపై ప్రయాణం నరకపు ద్వారం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గత తెలుగుదేశం ప్రభుత్వ పాలన నుండి తాము గుంటలు పడిన రహదారిపై ప్రయాణిస్తూ నరకయాతన అనుభవిస్తున్నామని తాతవారిపాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సూరేపల్లి పంచాయతీ పరిధిలోని తాతవారిపాలెం గ్రామం సూరేపల్లి నుండి కిలోమీటర్‌కుపైగా ఉంటుంది. రైతువారీగా ఉన్న ఈ గ్రామం దూరంగా ఉండటంతో ప్రతి పనికి సూరేపల్లి, భట్టిప్రోలు, రేపల్లె వంటి ప్రాంతాలకు వెళుతూ ఉంటారు. ఈ గ్రామం నుండి ఈపాటికే పలుమార్లు మండల పరిషత్ అధ్యక్షులుగా పనిచేసిన వాళ్లు కూడా ఉన్నారు. అయినప్పటికీ ఈ రహదారిని అభివృద్ధి పర్చుకోవడంలో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణ ఉన్నాయి. గత తెలుగు దేశం ప్రభుత్వ పాలనలో నాటి ఎంపిపి వాక సుధా శేషుబాబు ఆధ్వర్యంలో శాసన సభ్యులు నక్కా ఆనందబాబు అప్పట్లో తాతవారిపాలెం నుండి సూరేపల్లి వరకు సిసి రహదారి నిర్మించేందుకు రూ.90 లక్షలకుపైగా నిధులు వెచ్చించారు. ఆ నిధులతో అప్పట్లో కొంతమేర సిసి రహదారి నిర్మాణానికి అవసరమైన కీవాల్ ఏర్పాటు చేసి దానిలో డస్ట్ కూడా నింపారు. ఇంతలో 2019 ఎన్నికల నిబంధనలు అమలులోకి రావడంతో ఆ పని అర్ధాంతరంగా నిలిచిపోయింది. తదనంతరం గెలిచిన వైసిపి ప్రభుత్వ పాలనలో రహదారులను పట్టించుకోకపోవడంతో వేసిన కీ వాల్ పగిలిపోయి మధ్యలో నింపిన డస్ట్ కూడా రాకపోకలకు పక్కకు జరిగి పెద్ద పెద్ద గుంటలు ఏర్పడ్డాయి. ఈ గుంటల్లోనే గ్రామస్తులు గడిచిన ఐదేళ్లుగా ప్రయాణించాల్సి వచ్చింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలోనైనా ఈ రహదారి అభివృద్ధికి నోచుకుంటుందని గ్రామస్తులు ఆశపడ్డారు. కానీ అప్పట్లో అంచనాల ప్రకారం మంజూరైన నిధులతోనే ఈ రహదారి అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులు చెబుతుండటంతో అప్పట్లో పని ప్రారంభించిన గుత్తేదారు ప్రస్తుతం పెరిగిన ధరలతో రహదారి నిర్మాణ పనులు చేపట్టాలంటే తనకు గిట్టుబాటు కాదని, పనిని జరిపించడానికి ముందుకు రావడం లేదు. దీంతో ఈ ఏడాది కూడా వేసవి కాలం పూర్తి చేసుకుని వర్షాలు ప్రారంభమైన దృష్ట్యా గుంటల రహదారిపైనే నడవాల్సిన దుస్థితి కనిపిస్తుందని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాతవారిపాలెం రహదారిపై ఏర్పడిన గుంతలు

ధరలకు అనుగుణంగా అంచనాలు పెంచాలి

తాతావారిపాలెం రహదారి అభివృద్ధి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల దృష్ట్యా ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా అంచనాలు రూపొందించి మరోసారి రహదారి నిర్మాణ పనులు చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు ఇటీవల స్థానిక శాసన సభ్యులు నక్కా ఆనందబాబు దృష్టికి కూడా తీసుకువెళ్లి రహదారిని అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. ఈ గ్రామం నుండి అనేక మంది విద్యార్థులు సూరేపల్లి ఉన్నత పాఠశాలకు నిత్యం వెళ్లాల్సి ఉంటుంది. ఈపాటికే వర్షాలు ప్రారంభమై రహదారి గుంటల్లో నీరు నిలబడి ప్రయాణించే పరిస్థితి లేకపోయిందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. పదేళ్లుగా గ్రామస్తులు ఈ రహదారిపై ప్రయాణించలేక అనేక ప్రమాదాలకు గురవుతున్న దృష్ట్యా అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవచూపి రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, రహదారి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మహాలక్ష్మి కాంప్లెక్స్‌ను సందర్శించిన ఏలూరి

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక చీరాల ఆర్ అండ్ బి రోడ్డులో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మి కాంప్లెక్స్‌ను శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేశారు. కాంప్లెక్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాంప్లెక్స్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ షంషుద్దీన్, మక్కెన శేఖర్ బాబు, కోడూరి బ్రహ్మం, ఎ శ్రీనివాసరావు, సురేంద్ర, షేక్ గౌస్ బాషా, కాంప్లెక్స్ నిర్వాహకులు తాటి మురళి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉల్లగల్లు సచివాలయం సిబ్బంతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ముండ్లమూరు

మండలంలోని పెద్ద ఉల్లగల్లు, పసుపుగల్లు గ్రామాల్లోని సచివాలయాలను ఎంపిడిఒ పి సునీత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. సచివాలయంలో సిబ్బంది తక్కువగా ఉండటంతో మిగిలిన సిబ్బంది ఎక్కడికి వెళ్లారనే విషయాలపై చర్చించారు. ప్రతిరోజు సచివాలయ ఉద్యోగులు తప్పని సరిగా హాజరై ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందే సేవలు సక్రమంగా అందించాలని ఆదేశించారు. విధులకు హాజరుకాని ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకొని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వర్తించాలని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శులు జె రాజరాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

23న జాబ్ మేళా

ప్రజాశక్తి - అద్దంకి

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 23న శింగరకొండలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పి ప్రణయ్, కళాశాల ప్రిన్సిపల్ లాజారేష్ బాబు తెలిపారు. ఎల్ అండ్ టి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, హెటిరో లాబ్స్, అమర రాజా బ్యాటరీస్, కళ్లామ్ టెక్స్‌టైల్స్, కృష్ణపట్నం పోర్ట్, యాక్సిస్ బ్యాంక్, స్కిల్ క్రాఫ్ట్, అపోలో టైర్స్, డైకిన్, ముత్తూట్ ఫినస్ కంపెనీలు హాజరవుతున్నాయని తెలిపారు. వెయ్యికిపైగా ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు విద్యార్హతను బట్టి రూ.12వేల నుండి రూ.20 వేల వరకు నెలవారీ వేతనం ఉంటుందని తెలిపారు. ఎస్ఎస్సి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, డిప్లొమా విభాగంల వరకు చదువుకున్న 18 నుండి 30ఏళ్ల వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు బయోడేటా లేదా రెస్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్ పోర్ట్ ఫోటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని తెలిపారు. ఆధార్‌కు లింకైన మొబైల్ అందుబాటులో తప్పనిసరిగా ఉంచుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం గోపీనాద్‌ను 9440635677, రమేష్‌ను 99499 14337 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులు https:// naipunyam.ap.gov.in వెబ్ పోర్టల్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9988853335 టోల్ ఫ్రీ నెంబర్లో కూడా సంప్రదించవచ్చని తెలిపారు.

మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

యోగా అందరి జీవితాల్లో భాగమవ్వాలి..

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

యోగా అందరి జీవితాల్లో భాగం కావాలని సమాచార శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ కవాతు మైదానంలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర క్యాంపెయిన్ కర్టెన్‌రైజర్ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కష్ణప్రసాద్, కలెక్టర్ జె.వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ రాజు, పర్చూరు శాసనసభ్యులు ఏలూరు సాంబశివరావు, చీరాల శాసనసభ్యులు ఎం మాలకొండయ్య పాల్గొని యోగా గురువు పతంజలి చిత్రపటానికి పూలమాల వేసి.. జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలపై నెలరోజులపాటు విస్తతంగా అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకట మురళి మాట్లాడుతూ యోగా వలన శారీరక, మానసిక ధైర్యం వస్తుందని అన్నారు. జిల్లాలోని 17 లక్షల మందికి చేరే విధంగా ఒక యోగా ప్రణాళిక చేసుకున్నామన్నారు. జూన్ 21వ తేదీన సూర్యలంక, రామాపురం బీచ్ లో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ వారి జీవన శైలిలో యోగా ఒకటిగా చేర్చుకోవాలని ఆయన తెలిపారు. యోగా వలన శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా ఉంటామని ఆయన తెలిపారు. ప్రజలందరూ యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగ స్వాములు కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యోగా శిక్షకులచే యోగాసనాలు అభ్యాసం చేయించారు. మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు, అధికారులు పాల్గొని యోగాసనాలు వేశారు.

పది నెలల్లో అభివృద్ధి చేసి చూపాం..

- ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

- ఒంగోలులో ఘనంగా మినీమహానాడు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మినీ మహానాడులో బుధవారం ఒంగోలులో మిని మహానాడు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ, పార్టీ పరిశీలకులు సుబ్రహ్మణ్యం పాల్గొన్నడం జరిగినది. ముందుగా ఎంఎస్ ఫంక్షన్ హాల్ నందు ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. తదుపరి చనిపోయిన తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మరియు పహల్గం దాడుల్లో ఉగ్రవాదుల చేతిలో మరణించిన వారికి సంతాపం తెలియజేయుడం జరిగినది. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ మహానాడు కార్యక్రమం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు నిజమైన పండుగ అన్నారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు మూల స్తంభాలని, దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని కార్యకర్తల బలం తెలుగుదేశం పార్టీకి ఉందన్నారు. జగన్ హయాంలో రాష్ట్రంలోని అన్ని రంగాలు విచ్ఛిన్నమై రాష్ట్రం అప్పుల ఊబిలోకి వెళ్లిందని పేర్కొన్నారు. సీఎం చంద్ర బాబు రాష్ట్రాన్ని తిరిగి ప్రగతి పథంలో నడిపించేందుకు ఆహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో కార్యకర్తలు ప్రభుత్వానికి తోడ్పాటు అందించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా వైసిపి ఐదేళ్ళలో చేయలేని అభివృద్ధి కూటమి ప్రభుత్వం కేవలం పది నెలల్లో పూర్తి చేసిందన్నారు. గత పాలకులు మంత్రిగా వుండి కూడా అతని నిర్లక్ష్యం వలన ఒంగోలు నగరం అస్తవ్యస్థం అయ్యిందని ఆగ్రహం వ్యక్తం చేసారు. గత ప్రభుత్వంలో విర్రవీగుతూ విధ్వంసం సృష్టించిన ప్రతి ఒక్కరికి చట్ట ప్రకారం గుణపాఠం తప్పదన్నారు. మహిళలు అని కూడా చూడకుండా మన నాయకులు మరియు కార్యకర్తలు మీద దాడిచేసిన వారిని వదిలేది లేదు అని ఈ సందర్భంగా తెలియజేసారు. అదే విదంగా ఒంగోలు నగరంలో నూతనంగా 25 కోట్ల రూపాయలతో రోడ్లు,డ్రయినేజీలు,సిసి రోడ్లు, పార్క్ లు అభివృద్ధి చేయడం జరిగింద న్నారు. త్వరలోనే ఒంగోలు నగరంలో ఇంటిం టికి తాగునీరు అందిస్తామన్నారు. ఈ సందర్భం గా నియోజకవర్గంలోని 10 రకాల సమస్యలు మరియు అభివృద్ధికి చెందిన అంశాలపై తీర్మానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ కామేపల్లి సీతారామ య్య, నియోజకవర్గ పరిధిలోని టిడిపి ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులు, తెలుగు మహిళలు, తెలుగు యువత, ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ సెల్ నాయకులు, మండల, వార్డు కమిటీల పెద్దలు, టిడిపి అనుబంధ విభాగాలు నాయకులు... వేలాదిగా పార్టీ శ్రేణులు పాల్గొన్నారు...

జిల్లాలో బీచ్‌ల అభివృద్ధికి ప్రణాళికలు

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సూర్యలంక బీచ్ అభివద్ధి పనులలో మడ మొక్కలకు ఎటువంటి ఆటంకం కలగకుండా పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన జిల్లాలో బీచ్‌ల అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. సూర్యలంక బీచ్ ని సర్వాంగ సుందరంగా తయారు చేయడంలో అధికారులకు జిల్లా కలెక్టర్ పలుసూచనలు చేశారు. స్వదేశీ దర్శన్ 2.0 పథకం కింద బీచ్ ల అభివద్ధికి భారత ప్రభుత్వం రూ 97.52 కోట్లు మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. బీచ్ అభివద్ధికి టూరిజం కార్పొరేషన్ కు 25 ఎకరాల స్థలాన్ని కేటాయించడమైనందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బీచ్ లో చేపట్టే అభివద్ధి పనులపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. అధికారులు బీచ్ లో చేపట్టే వివిధ పనులను జిల్లా కలెక్టర్ కు వివరించారు. మడ అడవులను సందర్శించడం టూరిజం యొక్క ప్రత్యేకత అని ఆయన అన్నారు. మీరు ఏర్పాటు చేసిన జట్టిలో వెళ్తూ వారు ఆ మడ మొక్కలని తిలకిస్తారని, వాటి వలన పచ్చదనం ఎక్కువగా ఉంటుందని ఆయన అన్నారు. కాలువకు ఇరు ప్రక్కల మడ మొక్కల అభివద్ధిలో అటవీశాఖ సహకారంతో జిల్లా కలెక్టర్ సూచనలతో పని చేయాలన్నారు. ఆ మడ అడవిలో గిరిజనులు చేపల వేట చేస్తారని ఆయన అన్నారు. బీచ్ అభివద్ధిలో మడ మొక్కలను తొలగించే పనులు చేయవద్దని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో టూరిజం కార్పొరేషన్ డి.ఈ శ్రీనివాస్ యాదవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ కార్పొరేషన్ మరియు మున్సిపాలిటీ యాజమాన్యం కింద పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్‌లు, ఎస్ జిటిల బదిలీల ప్రక్రియ బుధవారం నుండి ప్రారంభమయినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఏ.కిరణ్‌కుమార్ తెలిపారు. తప్పనిసరిగా (కంపల్సరీ) బదిలీ అయ్యేవారు, అభ్యర్ధన (రిక్వెస్ట్) కోరుకునేవారు ఆన్లైన్ ద్వారా బదిలీ కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. రీ-అపోర్షన్‌మెంట్ ప్రక్రియలో భాగంగా సరస్ కాబడి ప్రిఫరెన్షియల్ కేటగిరీ క్రింద దరఖాస్తు చేయు అభ్యర్ధులు ఎవరైనా ఇంతకు ముందు (అనగా 24.04.2025 నుంచి 26.04.2025) మెడికల్ బోర్డ్‌లో మెడికల్ చెకప్‌కు హాజరుకాని వారు ఇప్పుడు వెళ్లి లేటెస్ట్ మెడికల్ సర్టిఫికెట్ పొందాలని తెలిపారు.

పాఠశాలల హెడ్ మాస్టర్లు గురువారం (మే 22) లోగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి. స్కూల్ అసిస్టెంట్లు మే 24 లోగా, సెకండరి గ్రేడ్ టీచర్లు గురువారం మే 27లోగా దరఖాస్తు చేసుకోవాలి. హెడ్ మాస్టర్లకు సంబంధించి 22 లోపు వెరిఫికేషన్ పూర్తి చేస్తారు. స్కూల్ అసిస్టెంట్ల బదిలీ దరఖాస్తులు 25న, ఎస్జిటీలు దరఖాస్తులు 28 లోపు వెరిఫికేషన్ చేస్తారు. సీనియారిటీ లిస్టులు హెడ్ మాస్టర్లవి 24న, స్కూల్ అసిస్టెంట్ల లిస్టు 26, 27న ఎస్‌జిటీలు ఈ నెల 31న ప్రకటిస్తారు. విజ్ఞప్తులు, అభ్యంతరాలు ఏమయినా ఉంటే హెడ్ మాస్టర్లు మే 25, స్కూల్ అసిస్టెంట్లు మే 28, ఎస్‌జిటీలు మే 28 నుంచి జూన్ 1లోపు చేసుకోవాలి. విజ్ఞప్తులు, అభ్యంతరాలపై తుది నివేదికను హెడ్ మాస్టర్ల కు సంబంధించి మే 27న, స్కూల్ అసిస్టెంట్స్ మే 28, 29, ఎస్జిటీ లకు సంబంధించి మే 28 నుంచి జూన్ 2 వరకు వెల్లడిస్తారు. కాగా ఈ నెల 27న హెడ్ మాస్టర్ సీనియారిటీ లిస్టు ప్రకటిస్తారు, 31న స్కూల్ అసిస్టెంట్ సీనియారిటీ లిస్టు, జూన్ 6న ఎస్‌జిటీల సీనియారిటీ లిస్టు ప్రకటిస్తారు. కాగా వెబ్‌ఆప్షన్‌లు రిజిస్టర్ చేసుకునేందుకు హెడ్‌మాస్టర్లు మే 28, స్కూల్ అసిస్టెంట్లు జూన్ 1, 2 తేదీలు, ఎస్‌జిటీలు జూన్ 7 నుంచి 10 వరకు నమోదు చేసుకోవచ్చు. ఈ నెల 30 న హెడ్ మాస్టర్లకు జూన్ 4న స్కూల్ అసిస్టెంట్లకు, 11న ఎస్‌జిటిలకు బదిలీ పత్రాలు అందజేస్తారు.

స్కూల్ అసిస్టెంట్ నుంచి హెడ్‌మాస్టర్‌గా ప్రమోషన్ ప్రక్రియ మే 30న చేపట్టి 31న ఉత్తర్వులు అందజేస్తారు. ఎస్‌జిటి నుంచి స్కూల్ అసిస్టెంట్ గా ప్రమోషన్ ప్రక్రియను జూన్ 5న చేపట్టి 6న ఉత్తర్వులు అందజేస్తారు.

క్రమశిక్షణ పాటించకపోతే కఠినచర్యలు

సచివాలయ సిబ్బందిని హెచ్చరించిన కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

సచివాలయ సిబ్బంది క్రమ శిక్షణ పాటించకపోతే కఠినచర్యలు తప్పవని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సా రియా హెచ్చరించారు. బుధవారం ఆమె ఒంగోలు శివారులోని కొప్పోలు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయం ద్వారా స్థానికులకు అందుతున్న సేవలపై అరా తీశారు. రీ సర్వే డేటాను కలెక్టరే కంప్యూటర్ లో పరిశీలించారు. ఆధార్ కార్డ్ లేని చిన్నారులు సచివాలయం పరిధిలో ఎంత మంది ఉన్నారు? వారికి ఆధార్ కార్డ్స్ అందేలా ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అని మహిళా సంరక్షణ కార్యదర్శిని ప్రశ్నించారు. ఇందుకు సంబంధిచిన రికార్డ్స్‌ను తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది వేస్తున్న బయోమెట్రిక్ హాజరు వివరాలను కలెక్టర్ పరిశీలించారు. కొందరు సిబ్బంది 11 గంటలకు వచ్చినట్లు ఆమె గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయ పాలన, సేవల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు. సచివాలయ పరిధిలో శానిటేషన్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

రికార్డులు పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ

పిహెచ్‌సిలలో తనిఖీ

ప్రజాశక్తి-అర్ధవీడు

మండలంలోని అర్ధవీడు, యాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డిఎంహెచ్‌ఒ టి.వెంకటేశ్వర్లు బుధవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా డాక్టర్లు గానీ, నర్సులు గానీ సమయపాలన పాటించాలని ఆదేశించారు. హాస్పిటల్‌లో 24 గంటలూ అందుబాటులో ఉండాలన్నారు. హాస్పిటల్‌కు వచ్చే పేషంట్లకు, డాక్టర్లకు మంచి అభినాభావ సంబంధం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ కిరణ్‌కుమార్, కోటేశ్వర్లు, మెడికల్ ఆఫీసర్ జవహార్ కుమార్, ఎస్.కె.మొనరసూల్, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలాన్ని అభివృద్ధి చేయాలి

కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కమిషనర్‌కు అర్జీ ఇస్తున్న నాయకులు

ఆక్రమణల నుంచి కాపాడిన మున్సిపల్ ఖాళీ స్థలం ప్రజల విని యోగించుకునేలా చర్యలు చేపట్టాలని 35వ వార్డు అభివద్ధి కమిటీ విజ్ఞప్తి చేసింది. కమిటీ నాయకులు బుధవారం సాయంత్రం ఒంగోలు కమిషనర్ వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. పాత సుజాత నగర్ విఐపి రోడ్డు సర్వేనెంబర్ 279/1బి లోని 30 గదుల మున్సిపల్ ఖాళీ స్థలాన్ని ఇటీవల ఆక్రమణల నుండి అధికారులు కాపాడిన అంశం విదితమే. కాగా భవిష్యత్‌లో ఆ స్థలం అన్యాక్రాంతం కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివద్ధి పరచడానికి చర్యలు చేపట్టాలని వారు కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించి చర్యలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. కమిషనర్‌ను కలిసిన వారిలో నగర నాయకులు చీకటి శ్రీనివాసరావు, 35వ వార్డు అభివద్ధి కమిటీ నాయకులు దామా శ్రీనివాసులు, షేక్ సిద్దయ్య, ఏ రామకృష్ణ, ఎస్‌డి హుస్సేన్ ఉన్నారు.